

కల్యాణతంతులో తాళిబొట్టు చూపుతున్న వేదపండితులు



తాళ్లపాకలో అంగరంగ వైభవంగా శ్రీవారి కల్యాణం

● హాజరైన శారదా పీఠాధిపతి స్వరూపానందస్వామి

రాజంపేటటౌన్, మే 23: అన్నమయ్య జయంతి మహోత్సవాల సందర్భంగా గురువారం తాళ్లపాకలో వేద పండితులు శ్రీదేవి భూదేవిలతో శ్రీనివాస కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకకు శారదా పీఠాధిపతి స్వరూపానంద స్వామి హాజరయ్యారు. టీటీడీ వేద పండితులు, వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రధానార్చకులు వేణు దీక్షితులు ఈ కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అన్నమాచార్య ప్రాజెక్టు డైరెక్టర్ భూషణశర్మ, ఆలయ అర్చకులు బాలాజీ, అన్నమాచార్య ప్రాజెక్టు సభ్యులు, తాళ్లపాక సర్పంచ్ గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కల్యాణానికి వచ్చిన భక్తులనుద్దేశించి శారదా పీఠాధిపతి స్వరూపానందస్వామి మాట్లాడుతూ రాయలసీమ ప్రాంతంలో అన్నమయ్య జన్మించడం ఈ ప్రాంతం చేసుకున్న పుణ్యమన్నారు. అన్నమయ్య వల్లే నేడు తిరుమల శ్రీవారికి ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు వచ్చిందని, ప్రధానంగా తెలుగు భాషకు తొలి వాగ్గేయకారుడిగా వాసికెక్కారన్నారు. 32 వేల కీర్తనలు రచించి శ్రీవారి గొప్పతనాన్ని వెలుగెత్తి చాటిన గొప్ప వాగ్గేయకారుడు అన్నమయ్య అని కొనియాడారు. పరమ భక్తుడైన అన్నమాచార్యుల ఎదుట శ్రీదేవి భూదేవి సమేత శ్రీవారు విచ్చేసి ఈ కల్యాణం జరిపించుకోవడం ఆనందంగా ఉందన్నారు. అన్నమయ్య భక్తిని మెచ్చి శ్రీవారే ప్రత్యక్షమయ్యారన్నారు. జయంతి ఉత్సవానికి తాను రావడం పూర్వ జన్మ సుకృతమన్నారు.

108 అడుగుల విగ్రహం వద్ద ఊంజల్ సేవ

జయంతి ఉత్సవాల సందర్భంగా అన్నమయ్య 108 అడుగుల విగ్రహం వద్ద శ్రీవారి ఊంజల్ సేవను వేదపండితులు కన్నుల పండువగా నిర్వహించారు. అన్నమయ్య ప్రాజెక్టు కళాకారుల సంకీర్తనల మధ్య ఈ కార్యక్రమాన్ని జరిపించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉత్సవాలు తొలిరోజున తాళ్లపాకలో సంకీర్త, గోష్టిగానం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయపార్థసారథి, హేమమాలిని బృందంచే సంగీత సభ నిర్వహించారు. అన్నమయ్య 108 విగ్రహం వద్ద నారాయణస్వామి, నాగలక్ష్మి బృందంచే ఊంజల్‌సేవ, సంకీర్తన గానామృతాన్ని, లక్ష్మికుమారి బృందంచే పారాయణాన్ని ఆలపించారు.



స్వామివారి కల్యాణానికి హాజరైన భక్తులు


మీ ఓటు ఎవరికేశారు..?

● రంగంలోకి డ్వాక్రా గ్రూపులు, వలంటీర్లు ● అనధికారికంగా సర్వే చేయిస్తున్న అధికార పార్టీ నేతలు ● గెలుపు దిశగా టీడీపీ, ఓటమి భయంలో వైసీపీ



(రాయచోటి-ఆంధ్రజ్యోతి): ఒకవైపు ఎన్నికల ఫలితాలు ఎప్పుడు వస్తాయా అని పోటీచేసిన అభ్యర్థులు, ప్రధాన పార్టీల అభ్యర్థులు ఉత్కంఠగా ఎదురు చూస్తుంటే.. మరోవైపు ఎవరు గెలుస్తారు ? ఎంత మెజార్టీ వస్తుంది? అని బెట్టింగ్‌రాయుళ్లు కాకిలెక్కలు వేసుకునే పనిలో పడ్డారు. ఈ క్రమంలోనే ఎవరు.. ఏ పార్టీకి ఓటేశారో ఎన్నికల ఫలితాలకంటే ముందే తెలుసుకునేందుకు అధికార పార్టీ డ్వాక్రా గ్రూపు సభ్యులను, వలంటీర్లను రంగంలోకి దించినట్లు తెలిసింది. ఈ నెల 13న సార్వత్రిక ఎన్నికలు జరిగాయి. వచ్చే నెల 4న ఫలితాలు వెల్లడికానున్నాయి. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా దాదాపు అన్ని నియోజక వర్గాల్లోనూ.. కొందరు డ్వాక్రా మహిళలు, వలంటీర్లు ఇంటింటికీ తిరిగి.. మీరు ఏ పార్టీకి ఓటు వేశారు..? అధికార వైసీపీకా? ప్రతిపక్ష టీడీపీకా ? అని వివరాలు సేకరిస్తున్నారు. అధికార పార్టీకి పోలైన ఓట్లు ఎన్ని ? టీడీపీకి ఎన్ని పడ్డాయి ? అనేది తెలుసుకునేందుకు.. డ్వాక్రా మహిళలు, వలంటీర్లను రంగంలోకి దించినట్లు తెలిసింది. ఈ తతంగాన్ని అధికార పార్టీ అనధికారి కంగా నిర్వహిస్తోంది. నిబంధనల ప్రకారం.. ఓటు ఎవరికి వేశారో ? అడిగే హక్కు ఎవరికీ ఉండదు. ప్రైవేటు సర్వే సంస్థలు కూడా.. ఎవరైందీ తెలియకుండా జాగ్రత్తలు తీసుకుంటూ.. వివరాలు సేకరిస్తుంది. అయితే స్థానికంగా ఉండే.. డ్వాక్రా మహిళలు, వలం టీర్లు స్థానికులు ఎవరికి ఓటు వేశారో ? తెలుసుకోవడం వల్ల భవిష్యత్తులో సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నప్పటికీ.. డ్వాక్రా మహిళలు, వలంటీర్లు సర్వే చేయడంపై ప్రజలు విస్తుపోతున్నారు.

జిల్లాలో తంబళ్లపల్లె, మదనపల్లె, పీలేరు, రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరు అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. పై అన్ని స్థానాల్లోనూ.. వైసీపీ పోటీ చేసింది. రైల్వేకోడూరులో జనసేన, మిగిలిన స్థానాల్లో టీడీపీ పోటీ చేసింది. రాజంపేట పార్లమెంటుకు కూటమి తరపున బీజేపీ బరిలో నిలిచింది. ఎన్నికలు ముగిసిన తర్వాత... పోలైన ఓట్లను బట్టి.. వైసీపీ, టీడీపీ, జనసేన పార్టీలు తామే గెలుస్తామనే ధీమాలో ఉన్నాయి. పీలేరు, రాయచోటి, రాజంపేటలో గెలుస్తామనే ధైర్యం టీడీపీలో ఉంది. రైల్వేకోడూరులో తామే గెలుస్తున్నామనే భరోసా జనసేనలో కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. కాగా అన్ని స్థానాల్లోనూ తమ పార్టీనే గెలుస్తుందని వైసీపీ ధీమాలో ఉంది. అయితే పోలింగ్ జరిగిన రోజు తెల్లవారుజాము ఐదున్నర గంటల నుంచే ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్ద క్యూలో నిల్చున్నారు. పెద్ద సంఖ్యలో మహిళలు, వృద్ధులు, యువకులు ఓటింగ్‌లో పాల్గొన్నారు. ఈ ఓట్లన్నీ తమకే పడ్డాయని టీడీపీ, వైసీపీ పోటాపోటీగా ధీమాతో ఉన్నాయి.



పెరిగిన పోలింగ్ శాతం.. తమకే అనుకూలమనే ఆశల పల్లకిలో ఇరు పార్టీలు ఉన్నాయి. ప్రత్యేకించి టీడీపీలో గెలుపుపై ధీమా కనిపిస్తోంది.

సైకిల్ గుర్తు ఎక్కడా..?

పోలింగ్ కేంద్రానికి వచ్చిన వాళ్లలో ఎక్కువ మంది సైకిల్ గుర్తు ఎక్కడా అని అడగడం చాలా పోలింగ్ కేంద్రాల్లో కనిపించినట్లు తెలుస్తోంది. రాజంపేట పార్లమెంటు స్థానానికి కూటమి తరపున బీజేపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి పోటీ చేశారు. అయితే ఎంపీ స్థానానికి కూడా సైకిల్ గుర్తుకే ఓటు వేయాలేమోనని కొందరు అవగాహన లేక సైకిల్ గుర్తు కోసం వెతికినట్లు తెలిసింది. కాగా పోలింగ్ కేంద్రంలో ఉన్న తమ పార్టీ ఏజంట్లు ఎంపీ స్థానం బీజేపీకి కేటాయించారని, కమలం గుర్తుకు ఓటు వేయాలని చెప్పినట్లు సమాచారం. ఈ లెక్కన ఓటర్లు తమసైకిల్ గుర్తుకే ఓటు వేశారనే అభిప్రాయంలో ఉన్నారు.

వైసీపీని వెంటాడుతున్న భయం

టీడీపీని గెలుపు ఆశలు ఊరిస్తుండగా.. వైసీపీని ఓటమి భయం వెంటాడుతోంది. 'నవరత్నాలు అనే సంక్షేమ పథకాలు అమలు చేశాం. మా ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి బటన్లు నొక్కారు. సంక్షేమ పథకాలు అందిన ప్రతిఒక్కరూ మాకే ఓటు వేస్తా'రని వైసీపీ నాయకులు ఆశించారు. అయితే క్షేత్రస్థాయిలో పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉండడాన్ని వైసీపీ నాయకులు గుర్తించారు. అభివృద్ధి కార్యక్రమాలు, నిరుద్యోగ సమస్య పలుచోట్ల అధికార పార్టీ నాయకుల దౌర్జన్యాలు, అక్రమాలు, ల్యాండ్ టైటిల్ యాక్టు వంటి అంశాలతో పాటు తదితర కారణాల వల్ల తమకు ప్రజలు వ్యతిరేకంగా ఓటు వేసి ఉంటారనే భయం వైసీపీ నాయకులను వెంటాడు తోంది. దీంతో ఫలితాలు వెల్లడయ్యే లోపు.. ప్రజలు ఎవరికి ఓటు వేశారో తెలుసుకోవాలని ఆతృత పడుతున్నారు. ఇందుకు తమకు అందుబాటులో ఉన్న డ్వాక్రా గ్రూపులను, వలంటీర్లను వినియోగించు కుంటున్నారు. ఆర్‌పీల ద్వారా డ్వాక్రా గ్రూపుల్లోని మహిళలతో మీ ఇంట్లో ఏ పార్టీకి ఓటు వేశారు? ఎన్ని వేశారు? వంటి వివరాలు సేకరిస్తున్నారు. సాధారణంగా ప్రతి ఆర్‌పీ కింద 25 నుంచి 30 గ్రూపులు ఉంటాయి. ఒక్కో గ్రూపులో పది మంది సభ్యులు ఉంటారు. వీళ్ల ద్వారా సమాచారాన్ని సేకరిస్తున్నట్లు తెలిసింది. బుధవారం సాయంత్రానికి సుమారుగా సమాచార సేకరణ పూర్తయినట్లు తెలిసింది. అదే విధంగా వలంటీర్ల ద్వారా తమ పరిధిలోని 50 ఇళ్లలో ఏ పార్టీకి ఓటు వేశారు? అని కూడా వివరాలు సేకరిస్తున్నట్లు తెలిసింది. కొందరు వలంటీర్లు ఇంటింటికీ తిరిగి వివరాలు సేకరిస్తుండగా.. మరికొందరు ఓటరు జాబితాను ముందు పెట్టుకుని.. ఎవరు ఏ పార్టీకి ఓటు వేసి ఉంటారు? అని అంచనా వేస్తున్నట్లు తెలిసింది. దీన్ని బట్టి.. ఈ ఎన్నికల్లో తాము గెలుస్తామా? లేదా అని ఫలితాలు వెల్లడయ్యే రోజుకంటే ముందే.. ఒక అంచనాకు వచ్చేందుకు అధికార పార్టీ ప్రయత్ని స్తోందని పలువురు పేర్కొంటున్నారు. నిబంధనలకు విరుద్ధంగా డ్వాక్రా మహిళలు, వలంటీర్లతో ఎవరికి ఓటు వేశారో తెలుసుకునేందుకు అధికార పార్టీ ఈ సర్వే చేయించడం వల్ల అధికారులు ఇబ్బందులు పడతారని పలువురు పేర్కొంటున్నారు.



ఓట్ల లెక్కింపును సమర్థవంతంగా నిర్వహించాలి

● శిక్షణా కార్యక్రమంలో కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్‌కిశోర్

రాయచోటి(కలెక్టరేట్), మే 23: ఓట్ల లెక్కింపు ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని ఆర్‌వోలు, ఏఆర్‌వోలు, నోడల్ అధికారులు, ఇతర సిబ్బందితో కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్‌కిశోర్ శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. గురువారం ఉదయం రాయచోటి కలెక్టరేట్‌లోని స్పందన హాలులో జూన్ 4న రాయచోటిలోని ఓట్ల లెక్కింపు కేంద్రమైన సాయి ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాట్లు, లెక్కింపు ప్రక్రియ, తయారు చేయబోయే వివిధ ఫారంలు, లెక్కింపు ముగిసిన అనంతరం తీసుకోవాల్సిన చర్యలు తదితర అంశాలపై జిల్లా ఎన్నికల అధికారి అధ్యక్షతన, రాయచోటి, మదనపల్లె ఆర్డీవోలు రంగస్వామి, హరిప్రసాద్‌లు, ఈఆర్‌వోలు, ఏఆర్‌వోలు, నోడల్ అధికారులు, ఇతర సిబ్బందికి శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అభిషిక్త్ కిశోర్ మాట్లాడుతూ జిల్లాలో పోలింగ్ ప్రక్రియను అధికారులందరూ సమర్థవంతంగా నిర్వహించారని, అదేవిధంగా ఓట్ల లెక్కింపు ప్రక్రియ కూడా సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. జూన్ 4న ఉదయం స్ట్రాంగ్ రూములను తెరవడం నుంచి ఓట్ల లెక్కింపు పూర్తయిన తర్వాత ఈవీఎంలను వేరే హౌస్‌కు తరలించే వరకు ప్రతి విషయంపై కూలంకుషంగా అవగాహన ఉండాలన్నారు. అంతకుముందు రాయచోటి, మదనపల్లె ఆర్డీవోలు, రంగస్వామి, హరిప్రసాద్‌లు ఆర్‌వోలు, ఏఆర్‌వోలు, నోడల్ అధికారులు, ఇతర సిబ్బందికి కండక్ట్ ఆఫ్ ఎలెక్షన్ రూల్స్ 1961, భారత ఎన్నికల సంఘం నిర్దేశించిన నియమ నిబంధనలను పాటిస్తూ నిర్వహించాల్సిన పోస్టల్ బ్యాలెట్‌ల లెక్కింపు, ఈవీఎం ఓట్ల లెక్కింపు తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు.

అధికారుల సమావేశంలో శిక్షణా తరగతులపై మాట్లాడుతున్న కలెక్టర్ అభిషిక్త్‌కిశోర్



కోడుమూరు బస్సు ప్రమాదంలో ఇద్దరు చిన్నారులు మృతి

మైదుకూరు, మే 23: కర్నూలు జిల్లా కోడుమూరు వద్ద జరిగిన బస్సు ప్రమాదంలో మైదుకూరుకు చెందిన ఇద్దరు చిన్నారులు మృతి చెందారు. వేసవి సెలవుల నిమిత్తం హైదరాబాదులోని బంధువుల ఇంటికి వెళ్లి తిరుగు ప్రయాణంలో వస్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. వివరాలిలా.. మైదుకూరు పట్టణంలోని రజక వీధికి చెందిన కొత్తపల్లె సురేశ్, కవితల కుమార్తె గోవర్ధని(7), నంద్యాల రోడ్డులోని పోలమ్మగారి వెంకటేశ్, పద్మావతిల కుమార్తె లక్ష్మి(13) మరో ఇద్దరు బంధువుల అమ్మాయిలను తీసుకుని వేసవి సెలవుల నిమిత్తం క్రిష్ణవేణి (గోవర్ధని మేనత్త) హైదరాబాదు వెళ్లారు. తిరిగి ఆమె పిల్లల్ని తీసుకుని హైదరాబాదు నుంచి ఓ ప్రైవేట్ బస్సులో బయలుదేరింది. ఈ క్రమంలో కోడుమూరు వద్ద బస్సు బోల్తా పడడంతో క్రిష్ణవేణి సహా మరో 40 మందికి గాయాలయ్యాయి. క్రిష్ణవేణికి రెండు కాళ్లు విరిగినట్లు సమాచారం. ఈ ప్రమాదంలో మైదుకూరుకు చెందిన గోవర్ధని, లక్ష్మి మృతిచెందారు. దీంతో రజక కాలనీలో విషాదం నెలకొంది.



లక్ష్మి (ఫైల్ ఫొటో)

గోవర్ధని (ఫైల్ ఫొటో)



కౌంటింగ్ నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు

● ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు సన్నద్ధం
● కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్‌కిశోర్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి

రాయచోటి(కలెక్టరేట్), మే 23: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి జిల్లా కేంద్రంలోని కౌంటింగ్ కేంద్రంలో ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్ ప్రక్రియ నిర్వహించేందుకు పటిష్టమైన ఏర్పాట్లతో సంసిద్ధంగా ఉన్నట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్‌కిశోర్ రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారికి వివరించారు. గురువారం విజయవాడలోని సచివాలయం నుంచి సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ఏర్పాట్లు భద్రతా చర్యలు తదితర అంశాలపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేశ్‌కుమార్‌మీనా అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించి తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు రాయచోటి కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్‌కిశోర్‌తో పాటు డీఆర్‌వో సత్యనారాయణరావు హాజరయ్యారు. ముందుగా రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి మాట్లాడుతూ చిన్న చిన్న సంఘటనలు మినహా అందరి సమష్టి కృషి, భాగస్వామ్యంతో ఈ నెల 13న రాష్ట్రంలో ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించారని, అదే స్ఫూర్తితో జూన్ 4న జరిగే ఓట్ల లెక్కింపు కార్యక్రమానికి ప్రణాళిక మేరకు పటిష్టమైన ఏర్పాట్లు చేసుకొని కౌంటింగ్ ప్రక్రియను విజయవంతం చేయాలని సూచించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలను పాటిస్తూ త్వరితగతిన ఖచ్చితమైన ఫలితాలను ప్రకటించేలా ముందస్తుగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకోవాలన్నారు. కౌంటింగ్ సందర్భంగా ముందస్తుగా పటిష్టమైన భద్రత, బందోబస్తు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఎటువంటి వివాదాలకు ఆస్కారం లేకుండా పారదర్శకంగా ఓట్ల లెక్కింపు ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. పాత్రికేయులకు ప్రత్యేకంగా వీడియో సెంటర్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్‌కిశోర్ మాట్లాడుతూ పార్లమెంట్ అసెంబ్లీ నియోజకవర్గం అన్నింటికీ రాయచోటిలో సాయి ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రంలో సీసీ కెమెరాల నిఘాలో కౌంటింగ్ ప్రక్రియ చేపడుతున్నామన్నారు. పార్లమెంట్, ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్‌కు కౌంటింగ్ కేంద్రంలో 14 టేబుళ్లను ఏర్పాటు చేశామని, ఈవీఎం స్ట్రాంగ్ రూముల నుంచి కౌంటింగ్ కేంద్రానికి ఈవీఎంలను తీసుకొచ్చే దారిలో సీసీ కెమెరాలు, బారికేడింగ్, కౌంటింగ్ కేంద్రంలోకి ప్రవేశించేందుకు ఏజెంట్లు అధికారులకు విడిగా బారికేడింగ్ ఏర్పాటు చేశామని, ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మేరకు కౌటింగ్ కేంద్రంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే జిల్లా కేంద్రంలోని కౌంటింగ్ కేంద్రంలో మూడంచెల భద్రతను ఏర్పాటు చేశామని, కౌంటింగ్ కేంద్రాల స్ట్రాంగ్ రూముల వద్ద ప్రత్యేక భద్రత బలగాలను ఏర్పాటు చేశామన్నారు. మీడియా కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల పోస్టల్ బ్యాలెట్, ఈవీఎంలలో పోలైన ఓట్ల కౌంటింగ్ కొరకు అదనంగా ఏఆర్‌వోలను, కౌంటింగ్ సూపర్‌వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లు, మైక్రో అబ్జర్వర్లను నియమించామని తెలిపారు. కౌంటింగ్ నిమిత్తం నియమించిన సిబ్బందికి శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లా కౌంటింగ్ ప్రక్రియను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని విధాల ఏర్పాట్లను పూర్తి చేస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ నరసింహకుమార్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.


పీలేరు డిపోలో ఇద్దరు డ్రైవర్లు సస్పెన్షన్

పీలేరు, మే 23: పీలేరు ఆర్టీసీ డిపోలో పనిచేస్తున్న ఇద్దరు డ్రైవర్లపై సస్పెన్షన్ వేటు పడింది. సంస్థ ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించినందుకు వారిని ఉన్నతాధికారులు సస్పెన్షన్ చేసినట్లు తెలిసింది. పీలేరు డిపోలో డ్రైవర్లుగా పనిచేస్తున్న టీసీ శేఖర్, వి.కుమార్ సస్పెన్షన్‌కు గురయ్యారు. పీలేరు డిపోలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న బాబు నాయక్‌పై వీరు అనుచితంగా ప్రవర్తించడమే కాకుండా అతనిపై పోలీసులకు ఫిర్యాదు చేయడమే సస్పెన్షన్‌కు కారణంగా తెలుస్తోంది. ఈ విషయమై పీలేరు డిపో మేనేజర్ బండ్లకుమార్ మాట్లాడుతూ... బాబు నాయక్‌పై వారిద్దరూ తమ సంస్థ ఉన్నతాధికారులకు సమాచారం లేకుండా పీలేరు పోలీసులకు ఫిర్యాదు చేశారని, అది క్రమశిక్షణ ఉల్లంఘన కిందకు వస్తుందని, ఈ విషయం తెలియడంతో తమ ఉన్నతాధికారులు వారిపై గత నెలలో విచారణకు ఆదేశించారన్నారు. విచారణ అనంతరం వారిద్దరినీ విధుల నుంచి సస్పెండ్ చేశారని వివరించారు. ఆర్టీసీ సంస్థ ప్రభుత్వంలో విలీనమైన తర్వాత పీలేరు డిపోలో ఇద్దరు సిబ్బంది సస్పెన్షన్‌కు గురికావడం ఇదే ప్రథమం. దీంతో ఈ విషయం గురువారం స్థానికంగా ఆర్టీసీ వర్గాల్లో చర్చనీయాంశమైంది.

ఖరీఫ్ సాగుకు సన్నద్ధం

● ప్రారంభమైన తొలకరి వర్షాలు ● విత్తనాల కోసం రైతుల రిజిస్ట్రేషన్ ● జిల్లాలో 1.63 లక్షల ఎకరాల్లో సాగు లక్ష్యం

కాడి కట్టి.. మేడి పట్టి.. చెర్నాకోల చేతబట్టి.. ఖరీఫ్ సాగుకు రైతన్న సన్నద్ధమవుతున్నాడు. ఎలాగోలా పంటను చేతికందించుకుని కష్టాల నుంచి బయటపడేందుకు సిద్ధమయ్యాడు. ఇందుకు గానూ రైతులు పొలాల్లో దుక్కులు దున్నడం ప్రారంభించారు. ఆర్‌బీకేల్లో విత్తనాలు తీసుకునేందుకు రిజిస్ట్రేషన్ కూడా చేయించుకుంటున్నారు. జిల్లాలో 1.63 లక్షల ఎకరాల్లో సాగే లక్ష్యంగా వ్యవసాయశాఖ అధికారులు ప్రణాళికలు రచిస్తున్నారు. తొలకరి వర్షాలతో పాటు రుతుపవనాలు కూడా ఈ ఏడాది ఆశించిన స్థాయిలో ఉంటాయని వాతావరణశాఖ అధికారులు ప్రకటించడంతో పాటు వాతావరణం కూడా అనుకూలిస్తుండడంతో జిల్లాలోని రైతాంగం ఖరీఫ్ సాగుపై ఆశలు పెంచుకుంటున్నారు.



రాయచోటిటౌన్, మే 23: మొలకల పౌర్ణమికి ముందే తొలకరి ప్రారంభమైంది. జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో ఇప్పటికే తొలకరి వర్షాలు కురుస్తున్నాయి. దీంతో జిల్లాలోని రైతాంగం ఖరీఫ్ సాగుకు సన్నద్ధమవుతున్నారు. ఆ దిశగా జిల్లా వ్యవసాయశాఖ అధికారులు కూడా విత్తనాల పంపిణీ కోసం ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే జిల్లాలోని విత్తనపు కాయల కోసం ఆర్బీకేలో రైతుల రిజిస్ట్రేషన్లు ప్రారంభమయ్యాయి. జిల్లాలో రైతుల డిమాండ్‌ను బట్టి వేరుశనగ విత్తన కాయలను సరఫరా చేసేందుకు ఏపీ సీడ్స్ వారు సిద్ధంగా ఉన్నారు. సాధారణంగా ఖరీఫ్ సీజన్ జూన్ 15 నుంచి జూలై 15వ తేది వరకు నెల రోజుల పాటు ఉంటుంది. గతేడాది సరైన వర్షపాతం లేక నష్టపోయిన రైతులు ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ రాక మునుపే తొలకరి వర్షాలు కురుస్తుండడంతో రైతన్నలు ఇప్పటికే తమ భూములను దుక్కులు దున్ని ఖరీఫ్ సాగు కోసం సన్నద్ధం చేస్తున్నారు. తొలకరి వర్షాలతో పాటు రుతుపవనాలు కూడా ఈ ఏడాది ఆశించిన స్థాయిలో ఉంటాయని ఐఎండీ వాతావరణశాఖ అధికారులు ప్రకటించడంతో పాటు వాతావరణం కూడా అనుకూలిస్తుండడంతో జిల్లాలోని రైతాంగం ఖరీఫ్ సాగుపై ఆశలు పెంచుకుంటున్నారు.

ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా ఆశాజనకంగా వర్షాలు పడుతున్నాయి. జిల్లాలోని 30 మండలాల్లో మంచి వర్షపాతం నమోదైంది. రైతులందరూ వ్యవసాయ పనుల్లో నిమగ్నమవుతున్నారు. ఈ వారమంతా వ్యవసాయ పనులు చేసుకోవడానికి వాతావరణం అనుకూలంగా ఉంది. ఈ ఏడాది సాధారణ వర్షపాతం నమోదవుతుందని వ్యవసాయశాఖ నుంచి సమాచారం రావడమే కాకుండా ఐఎండీ నివేదికలు కూడా వర్షాలు బాగా కురుస్తాయని చెబుతున్నారు. జిల్లాలో 1.63 లక్షల ఎకరాల్లో ఖరీఫ్ సాగు లక్ష్యంగా అధికారులు నిర్దేశించుకున్నారు. ఈ ఏడాది వేరుశనగ పంట పూర్తి స్థాయిలో సాగులోకి వచ్చే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 1.07 లక్షల ఎకరాల్లో వేరుశనగ సాగులోకి వచ్చే అవకాశం ఉందని అధికారుల లెక్కలు చెబుతున్నాయి. అలాగే వరి పంట కూడా 25 వేల ఎకరాల్లో సాగయ్యే అవకాశం ఉంటుందన్నారు. ఈ పంటలే కాక రైతులు కంది పంటను వేరుశనగలో అంతర పంటగా సాగు చేస్తారు. ప్రధాన పంటలుగా వేరుశనగ, వరి, కంది ఈ మూడు పంటలు అధిక విస్తీర్ణంలో సాగు చేసే అవకాశం ఉంది. ఇవి కాకుండా ఉలవ, అలసందలు, అనుములు, సజ్జలు, మొక్కజొన్న వంటివి సాగు చేసుకొనే అవకాశం కూడా ఉంది. దీంతో ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సాగు విస్తీర్ణం బాగా పెరిగే అవకాశం ఉంది. ప్రభుత్వం ఇప్పటికే 55 వేల క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు మంజూరు చేసింది. రైతు భరోసా కేంద్రాల్లో రైతుల రిజిస్ట్రేషన్ కూడా ప్రారంభించారు. జిల్లాలోని 400 రైతు భరోసా కేంద్రాలకు విత్తనాలు సరఫరా అయ్యేలా అధికారులు చర్యలు చేపట్టారు.

అలాగే జిల్లాలోని రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాల్లో అధికంగా ఉద్యానవన పంటలు సాగులో ఉన్నందున అక్కడి 7 మండలాలు మినహాయిస్తే మిగిలిన 23 మండలాల్లో వేరుశనగ సాగు చేయడానికి ఇప్పటికే రైతులు పొలాలను దుక్కులు దున్ని పంటల సాగుకు సిద్ధం చేసుకుంటున్నారు. ప్రభుత్వం రైతులకు 40 శాతం సబ్సిడీతో వేరుశనగ విత్తనాలు సరఫరా చేయనుంది. అలాగే పిల్లిపెసర లాంటి పచ్చిరొట్ట ఎరువుల కోసం జిల్లాకు 6 వేల క్వింటాళ్ల విత్తనాలు సరఫరా అయ్యాయి. వీటిని 50 శాతం సబ్సిడీతో రైతాంగానికి అందించేందుకు వ్యవసాయశాఖ అధికారులు ఏర్పాట్లు చేడుతున్నారు. ఇప్పటికే అధికారులు రిజిస్ట్రేషన్ ప్రారంభించి పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేయబోతున్నారు. ప్రధానంగా జిల్లాలోని రాజంపేట, రైల్వేకోడూరు ప్రాంతాల్లో 90 శాతం, మిగిలిన ప్రాంతాల్లో పది శాతం వరకు వరి పంటను సాగు చేస్తున్న రైతాంగానికి పచ్చిరొట్ట ఎరువుల తయారీ కోసం అవసరమైన విత్తనాలను 50 శాతం సబ్సిడీతో ప్రభుత్వం వ్యవసాయశాఖ ద్వారా ఇవ్వనుంది. నెలాఖరులోగా జిల్లాలో వేరుశనగ విత్తన పంపిణీ చేపట్టేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. ఈ క్రమంలోనే విత్తనాల కోసం రైతులకు ఆర్బీకేల్లో రిజిస్ట్రేషన్ కోసం అవకాశం కల్పిస్తున్నారు. ఈ నెల 29 నుంచి విత్తనాలు పంపిణీ చేయనున్నట్లు వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. ఖరీఫ్ కోసం 38 వేల మెట్రిక్ టన్నులు, రబీలో 30వేల మెట్రిక్ టన్నుల ఎరువులు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం అధికారులకు దిశా నిర్దేశం చేసింది. ఈ ఎరువులను ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలకు మొదటి ప్రాధాన్యతగా, సొసైటీలకు రెండో ప్రాధాన్య తగా, ప్రైవేటు డీలర్లకు మూడో ప్రాధాన్యత నిస్తోంది. జిల్లాకు వచ్చే ఎరువుల్లో 20 వేల మెట్రిక్ టన్నులు రైతు భరోసా కేంద్రాల ద్వారా అందించబోతున్నారు. జూన్ 15 నుంచి జూలై 15 వరకు వేరుశనగ విత్తన సాగుకు మంచి అదును కావడంతో రాయలసీమ జిల్లాల్లో జూలై చివరి వరకు వేరుశనగ పంట సాగు చేసే అవకాశం ఉంది.

ప్రతి రైతుకు విత్తనాలు అందిస్తాం..

తొలకరి ప్రారంభం కావడంతో ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ పంటను సాగు చేయాలనుకునే రైతులు రైతు భరోసా కేంద్రాల్లో వారంలోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. దాన్ని బట్టి ఆర్‌బీకేలకు విత్తనాలు, ఎరువుల సరఫరా చేస్తాము. ఆర్‌బీకేల్లో పురుగుల మందులు సైతం ఇవ్వబోతున్నాము. గతేడాది వర్షాభావ పరిస్థితులతో కరువును ఎదుర్కొన్నాము. జిల్లా వ్యాప్తంగా 18 మండలాలను కరువు మండలాలుగా గుర్తించి రూ.25 కోట్లు పంట నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ కింద ప్రభుత్వం సాయం అందించింది. అయితే ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు ముందే తొలకరి పలకరించడంతో వర్షాలు అనుకూలించే పరిస్థితులు ఉన్నాయి. ఒక వేళ కరువు పరిస్థితులు ఎదురైతే కంటిన్జెన్సీ క్రాప్ ద్వారా 80 శాతం సబ్సిడీతో విత్తనాలు అందిస్తాము.

- చంద్రానాయక్, జిల్లా వ్యవసాయ అధికారి



అట్టహాసంగా లక్ష్మీనరసింహస్వామి గరుడసేవ



కార్యక్రమములో పాల్గొన్న మాజీ మంత్రి సి.రామచంద్రయ్య, మాజీ సర్పంచ్ ఎంఎల్ నారాయణ, ఎం.లక్ష్మీనరసయ్య

రాజంపేట, మే 23: మండలంలోని భువనగిరిపల్లె లక్ష్మీనరసింహస్వామి వార్షిక బహ్మోత్సవాల్లో భాగంగా గురువారం గరుడసేవ కార్యక్రమాన్ని వేదపండితుల వేద పారాయణం మధ్య అట్టహాసంగా నిర్వహించారు. పెంచల నరసింహస్వామి గోవిందా.. భువనగిరిపల్లె లక్ష్మీనరసింహస్వామి గోవిందా.. ఆపద్బాంధవా గోవిందా.. అనాధ రక్షక గోవిందా.. అంటూ భక్తుల నామస్మరణతో ఆ ప్రాంతం మార్మోగింది. ఈ సందర్భంగా లక్ష్మీనరసింహస్వామి వారిని పురవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి సి.రామచంద్రయ్య, ఆయన కుమారుడు యువనేత విష్ణువర్దన్, మాజీ సర్పంచ్ ఎంఎల్ నారాయణ, ఆలయ ధర్మకర్తలు హరిప్రసాద్, వెంకటరమణ, నామాల రాజశేఖర్, కంబయ్యగారి సుబ్బనరసింహులు, లక్ష్మీనరసయ్య, సుబ్బనరసయ్య, భువనగిరిపల్లె గ్రామస్థులు పాల్గొన్నారు.

సింహ వాహనంపై నారాపురం వెంకటేశ్వరస్వామి



జమ్మలమడుగు, మే 23: జమ్మలమడుగులో గురువారం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనారాపురం వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా వైభవంగా ఊరేగింపు చేశారు. ఉదయం 8 గంటలకు స్వామివారిని ముత్యపుపందిరి వాహనంలో ఊరేగించారు. అనంతరం 10.30 గంటల నుంచి 11.30 గంటల వరకు స్నపన తిరుమంజనం, సాయంత్రం 6 గంలకు ఊంజల్‌సేవ, అనంతరం 7 గంటలకు అన్నమాచార్య కీర్తనలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణలో ప్రొద్దుటూరుకు చెందిన మహిళలు నృత్యపు కార్యక్రమాన్ని నిర్వహించారు. అల్లాడుపల్లె, జమ్మలమడుగు, మైలవరం మండలంలోని వేపరాల తదితర ప్రాంతాలకు చెందిన మహిళలు కోలాటం నిర్వహించారు. అనంతరం 7.30 గంటలకు శ్రీదేవి, భూదేవి శ్రీ నారాపురం వేంకటేశ్వరస్వామి సింహవాహనంపై ఊరేగించారు. అనంతరం రాత్రి 9 గంటలకు హరికథ నిర్వహించారు.

వైభవంగా నరసింహస్వామి కల్యాణోత్సవం





ఈటిమార్పురం గుట్టపై జరుగుతున్న ఆదిలక్ష్మి చెంచులక్ష్మీ సమేత నరసింహస్వామి కల్యాణానికి అమ్మవారికి ఆడబిడ్డ సాంగెం తీసుకు వస్తున్న యానాదులు

పెనగలూరు, మే 23: మండలంలోని ఈటిమార్పురం గుట్టపైన వెలసిన ఆదిలక్ష్మి, చెంచులక్ష్మిసమేత నరసింహస్వామి కల్యాణోత్సవం బుధవారం రాత్రి కన్నుల పండువగా నిర్వహించారు. టీటీడీకి చెందిన బాలాజీస్వామి పండితుల బృందం శాస్త్రోక్తంగా నిర్వహించారు. నాయుడువారిపల్లె, కురవరి గ్రామాల్లో వున్న చెంచు వంశస్థులు తమ ఆడబిడ్డ అయిన చెంచులక్ష్మి, ఆదిలక్ష్మిలకు పూలు, పండ్లు, దివ్య ఔషదాలు శ్రీవారికి సమర్పించారు. భారీగా భక్తులు వచ్చి కల్యాణాన్ని తిలకించారు. అనంతరం గరుడ వాహనంపై ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి సమేత శ్రీవారి గ్రామోత్సవం వైభవంగా జరిగింది. కార్యక్రమంలో కల్యాణోత్సవ దాతలు బత్తిన తిరుపాల్‌రెడ్డి, పద్మజ, చిన్నగుండాల్‌రెడ్డి, పెద్ద గుండాల్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, అమరనాథ్‌రెడ్డి, నరసరాజు, పెంచల రత్నం, పెంచల్‌రాజు తదితరులు పాల్గొన్నారు. శుక్రవారం నాయుడువారిపల్లెలో, శనివారం తూర్పుపల్లెలలో గ్రామోత్సవం జరుగుతుందని గ్రామోత్సవ పెద్దలు తెలిపారు. ఆదివారం ఈటిమార్పురం దళితుల ఆధ్వర్యంలో రథోత్స కార్యక్రమం జరుగనుందని తెలిపారు.

ఉద్యోగి పదోన్నతిలో అక్రమాలు

ప్రొద్దుటూరు, మే 22: ఆర్టీపీపీలో ఓ ఉద్యోగి పదోన్నతిలో అక్రమాలు చోటు చేసుకున్నాయి. ల్యాబ్ టెక్నీషియన్‌గా చేరిన ఆ ఉద్యోగి సీనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొందారు. దీనిపై ఫిర్యాదులు రావడంతో ఆ ఉద్యోగిని ఇటీవల తిరిగి టెక్నికల్ విభాగానికి బదిలీ చేశారు. వివరాలు ఇలా..

జిల్లాలోని డాక్టర్ ఎంవీర్ రాయలసీమ ధర్మల్ పవర్ ప్రాజెక్టు (ఆర్టీపీపీ)లో ఒకరు 2003లో ల్యాబ్‌టెక్నీషియన్‌గా ప్రాజెక్టు హాస్పిటల్‌లో చేరారు. ఏడేళ్ల తరువాత 2010లో మెడికల్ సర్వీసు నుంచి అకౌంట్ సర్వీసుకు కన్వర్షన్ పెట్టుకున్నారు. ల్యాబ్‌టెక్నీషియన్‌గా టెక్నికల్ కోర్సు చేసిన ఆ ఉద్యోగి డిగ్రీ బీఏ సర్టిఫికెట్‌తో కన్వర్షన్ పెట్టుకుని లోయర్ డివిజన్ క్లర్క్ (ఎల్‌డీసీ)గా పదోన్నతి పొందారు. ఆ తరువాత మరో పదేళ్లకు 2020లో మళ్లీ అప్పర్ డివిజన్ క్లర్క్ (సీనియర్ అసిస్టెంట్)గా పదోన్నతి పొందారు. ఆ తరువాత 2023లో 159 జీవో ఆధారంగా మహిళలకు 50 శాతం రిజర్వేషన్ కోటాలో జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్‌గా పదోన్నతికి యత్నించి ఎంపికయ్యారు. అయితే అప్పటికే జేఏవో పదోన్నతిలో ఉన్న ఓ ఉద్యోగికి రివర్షన్ ఇచ్చి ఆస్థానంలో ఆమెకు ప్రమోషన్ ఇవ్వాలని చూడటంతో ఆ ఉద్యోగి అభ్యంతరం వ్యక్తం చేశారు. అంతేకాకుండా ఆమెకు ల్యాబ్ టెక్నీషయన్ నుంచి జేఏవో వరకు ఎలా పదోన్నతి వచ్చిందో ఆరా తీశారు. ఇందులో బాగంగా ఆమె విద్యార్హతలు సమాచార హక్కు చట్టం ద్వారా తీసుకోవడంతో ఏకకాలంలో ఆమె రెండు కోర్సులు చేసినట్లు గుట్టు రట్టయింది. ఏకకాలంలో ఆమె రెండు కోర్సులు చేసినట్లు బాధిత ఉద్యోగి ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంపై ఆర్టీపీపీ చీఫ్ ఇంజనీర్ (సీఈ) గౌరీపతిని వివరణ కోరగా విద్యాభ్యాస ధ్రువపత్రాలను పరిశీలనకు పంపామని అవి సరైనవని తేలిందన్నారు. ఏకకాలంలో రెండు కోర్సులు చేసినా చెల్లుబాటు అవుతుందని ఆమె పదోన్నతికి సమస్యలేదని తెలిపారు. ఈ ఆరోపణల క్రమంలో ఏప్రిల్ 30న అకౌంట్స్ సర్వీసు నుంచి ఆ ఉద్యోగిని ఈఈ టెక్నికల్ విభాగానికి బదిలీ చేయడం గమనార్హం.

నిధి పోర్టల్‌తో సేవలు సులభతరం

శాఖపరమైన విచారణలను సకాలంలో పూర్తిచేయాలి ● రాయలసీమ జోనల్ సమావేశంలో ఈఎన్‌సీ బాలునాయక్



మాట్లాడుతున్న పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ ఇన్ చీఫ్ బాలునాయక్

కడప(రూరల్), మే 23: రాష్ట్రప్రభుత్వం తీసుకొచ్చిన నిధి పోర్టల్‌ను వందశాతం ఉపయోగించి తద్వారా సేవలను సులభతరం చేయాలని పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ ఇన్ చీఫ్(ఈఎన్‌సీ) బాలునాయక్ పేర్కొన్నారు. జిల్లా పరిషత్ సమావేశహాలులో గురువారం పంచాయతీరాజ్ ఇంజనీరింగ్‌శాఖ రాయలసీమ జోనల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. పంచాయతీరాజ్ ఇంజనీరింగ్‌శాఖలో టెక్నికల్ పరంగా పలు మార్పులు చోటుచేసుకున్నాయన్నారు. ఇందులో బాగంగా సీఎఫ్ఎంఎస్ స్థానంలో నిధి పోర్టల్‌ను తీసుకొచ్చారన్నారు. నిధి పోర్టల్ వినియోగం ద్వారా పని వేగవంతంగా, పారదర్శకంగా జరుగుతుందన్నారు. ఇప్పటి వరకు నిధిపోర్టల్ వినియోగంలో ఇతర ఇంజనీరింగ్‌శాఖల కన్నా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ ముందువరసలో ఉందన్నారు. జూలై, ఆగస్టు మాసాల నుంచి పంచాయతీరాజ్ ఇంజనీరింగ్‌శాఖకు సంబంధించిన పనులన్నీ పూర్తి స్థాయిలో నిధిపోర్టల్ ద్వారానే చేపట్టాలని ఆదేశించారు. ఇకపై డీపీఆర్ అంచనాల తయారీ, టెక్నికల్ శాంక్షన్, పరిపాలనా అనుమతులు తదితర అంశాలన్నీ నిధిపోర్టల్ ద్వారానే నిర్వహించాలన్నారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు మే 20న విజయవాడలో జోన్ 2 సమావేశాన్ని, 21న గుంటూరులో జోన్ 3 జోనల్ సమావేశాన్ని నిర్వహించి నిధిపోర్టల్ వినియోగంపై అవగాహన కల్పించి అక్కడి అధికారుల సమస్యలను అభిప్రాయాలను తెలుసుకున్నామన్నారు. ప్రస్తుతం కడపలో రాయలసీమ జోన్ 4 సమావేశాన్ని ఏర్పాటు చేశామన్నారు. 25న విశాఖపట్నంలో జోన్ 1 జోనల్ సమావేశం నిర్వహిస్తామన్నారు. విధినిర్వహణలో ఎలాంటి పొరపాట్లు చేయరాదన్నారు. బాధ్యతగా విధులు నిర్వర్తించాలన్నారు. శాఖ పరమైన విచారణలను సకాలంలో పూర్తిచేయాలన్నారు.

పవర్ ప్రజంటేషన్ ద్వారా అవగాహన


నిధిపోర్టల్, టెంప్లెంట్స్ ఇతర అంశాలపై పవర్ ప్రజంటేషన్ ద్వారా అధికారులకు అవగాహన కల్పించారు.

అడ్మినిస్ట్రేషన్ శాంక్షన్, టెక్నికల్ శాంక్షన్, అగ్రిమెంట్, ఈ ఎంబుక్, రోడ్డు పనులు, బ్రిడ్జిపనులు, బిల్డింగ్ పనుల మెజర్మంట్ తదితర వివరాలను నిధిపోర్టల్‌లో ఎలా పొందుపరచాలో తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చీఫ్ ఇంజనీర్లు అమర్‌నాథరెడ్డి, కృష్ణారెడ్డి, ఈఎన్‌సీ స్టాఫ్ విద్యాధర రావు, రమణకుమార్, శివప్రసాద్, కడప, అనంతపురం, కర్నూలు, చిత్తూరు ఉమ్మడి జిల్లాల ఎస్‌ఈలు శ్రీనివాసులరెడ్డి, వీరాస్వామి, సుబ్రమణ్యం, చంద్రశేఖర్‌రెడ్డితో పాటు రాయలసీమ జోన్ పరిధిలోని పీఆర్, క్వాలిటీకంట్రోల్ శాఖలకు చెందిన ఈఈలు, డీఈలు తదితరులు పాల్గొన్నారు.

26న పురుషుల క్రికెట్ ఎంపికలు

కడప (స్పోర్ట్స్), మే 23: కడప నగరం రిమ్స్ సమీపంలోని వైఎస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ స్టేడియంలో ఈనెల 26 ఉదయం 7 గంటలకు అండర్-16 పురుషుల క్రికెట్ ఎంపికలు జరగనున్నట్లు జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి అవ్వారు రెడ్డిప్రసాద్ తెలిపారు. ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు ఆధార్‌కార్డు కాపీ, పుట్టిన తేదీ సర్టిఫికెట్, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో, స్టడీ సర్టిఫికెట్ ఒరిజినల్స్‌తో పాటు ఒక సెట్ జిరాక్స్, కిట్ బ్యాగ్, తప్పక వెంట తీసుకురావాలన్నారు. కాగా అండర్-16 కట్ ఆఫ్ డేట్‌గా 2008 సెప్టెంబర్ 1 నుంచి 2010 ఆగస్టు 31 మధ్య జన్మించిన వారు అర్హులన్నారు.

గుండెపోటుతో సంజీవరెడ్డి మృతి



మైదుకూరు, మే 23: వరదా అగ్రిటెక్ నిర్వాహకుడు, కొత్త సాయిబాబా ఆలయ నిర్మాణకర్త అమ్మిరెడ్డి సంజీవరెడ్డి (70) గురువారం తెల్లవారు జామున మైదుకూరులో గుండెపోటుతో మృతిచెందారు. ఇంట్లో నిద్రిస్తుండగా గుండెపోటు రావడంతో వెంటనే వాహనంలో ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. కాగా శుక్రవారం మధ్యాహ్నం మైదుకూరు మండలం డయాంఖాన్‌పల్లెలో అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

కనులపండువగా కల్యాణోత్సవం



రాపూరు(డక్కిలి), మే 23 : ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో గురువారం ఉదయం చెంచులక్ష్మి, ఆదిలక్ష్మి సమేత పెంచలస్వామి కల్యాణం కనుల పండువగా జరిగింది. ముందుగా కల్యాణ మండపాన్ని శోభాయమానంగా అలంకరించి, వేదమంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నమధ్య స్వామి వారి కల్యాణాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ అధికారులు ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. స్వామి కల్యాణంతోపాటు పలు జంటలు సాముహిక వివాహాలు చేసుకొని ఒక్కటయ్యాయి. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై ఈ కార్యక్రమాన్ని తిలకించారు.కాగా వివిధ మండపాల్లో జరిగే విశేష పూజాకార్యక్రమాలను భారీ స్క్రీన్ల ద్వారా భక్తులు వీక్షించే అవకాశం కల్పించారు. కల్యాణం అనంతరం ఆలయ అర్చకులు చేపట్టిన ఎదుర్కోలు ఉత్సవం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ఏసీ డబ్బుగుంట వెంకటేశ్వర్లు, డీసీ కే విజయసాగర్ సాగరబాబు, ఆలయ ఇన్‌స్పెక్టర్ హరీష్, ప్రధాన అర్చకులు రామయ్యస్వామి, శశికుమార్ స్వామి, గుండ్లూరు సీతారామయ్య, పెంచలయ్య, బాలాజీ, మధు స్వామి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రథోత్సవం

గురువారం రాత్రి ఉభయ దేవేరులతో కలిసి పెంచలస్వామి తిరుత్తేరుపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేకంగా అలంకరించిన రథంపై ఉత్సవమూర్తులను కొలువు దీర్చి అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. శ్రీవారి ఆలయం నుంచి కోన ముఖద్వారం వరకు భక్తులు రథాన్ని లాగి మొక్కులు తీర్చుకున్నారు.

గంగనపల్లి ఉపాధ్యాయుడికి మూడు బంగారు పతకాలు



పతకాలతో శివశంకర్‌రెడ్డి

కడప (స్పోర్ట్స్), మే 23: పెండ్లిమర్రి మండలం గంగనపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న బుగ్గేటి శివ శంకర్‌రెడ్డి మూడు బంగారు పతకాలు సాధించారు. ఈనెల 22 నుంచి 23 వరకు హైదరాబాద్ గచ్చి బౌలి స్టేడియంలో మొదటి ఫెడరేషన్ కప్ నేషనల్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్- 2024 పోటీలు జరిగాయి. పాన్ ఇండియా మాస్టర్స్ గేమ్స్ ఫెడరేషన్, మాస్టర్స్ గేమ్స్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన పాన్ ఇండియా స్థాయి అథ్లెటిక్స్‌లో శివశంకర్‌రెడ్డి 45+ఏజ్ విభాగంలో సత్తా చాటి ఏకంగా మూడు బంగారు పథకాలు సాధించారు. హైజంప్‌తో పాటు లాంగ్ జంప్, ట్రిపుల్ జంప్ విభాగాలలో ప్రథమ విజేతగా నిలిచి జిల్లా ఖ్యాతిని ఇనుమడింపచేశారు. అలాగే నవంబర్‌లో ఆస్ట్రేలియాలో జరగనున్న అంతర్జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు శివశంకర్‌రెడ్డి ఎంపికైనట్లు పేర్కొన్నారు.

జాతరలో ఘర్షణ - కారు ధ్వంసం



పెనగలూరు, మే 23: మండలంలోని కాకర్ల వారిపల్లెలో బుధవారం రాత్రి ప్రారంభమైన దుర్గమ్మ జాతరలో ఘర్షణ చోటు చేసుకుంది. ఈ ఘర్షణలో ముగ్గురు వ్యక్తులకు స్వల్ప గాయాలు కాగా, కారును ధ్వంసం చేశారు. పోలీసుల వివరాల మేరకు.. అమ్మవారి ఊరేగింపు జరుగుతున్న సమయంలో గ్రామోత్సవం సమీపానికి ఓ కారు రాగా.. కారులో ప్రయాణిస్తున్న వారు మనుషులు పక్కకు జరగాలనే ఉద్దేశ్యంతో పదే పదే బిగ్గరగా హారన్ కొట్టారు. ఈ విషయమై గ్రామస్తులకు కారులో ప్రయాణిస్తున్న వారి మధ్య వాగ్వాదం జరిగి ఘర్షణకు దారి తీసింది. దీంతో మల్లికార్జున, చంద్ర, నరసింహులు, బాబు అనే వారు కారులో వెళ్తున్న ప్రకాష్, శివప్రసాద్, రంగనాథ్‌లపై దాడి చేశారు. ఈ ఘటనలో ప్రకాష్‌తో పాటు మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఈఎస్ సుభాష్ చంద్రబోస్ తెలిపారు. జాతరకు కేవలం ఇద్దరు కానిస్టేబుళ్లను బందోబస్తుకు నియమించడంతో ఘర్షణ జరిగిందని పలువురు విమర్శిస్తున్నారు.

ఫేజ్ జూనియర్ కళాశాలకు అనుమతి లేదు: ఆర్ఐఓ

కడప (ఎర్రముక్కపల్లె), మే 23 : ప్రొద్దుటూరులో గల ఫేజ్ సంస్థకు ఇంటర్మీడియట్ తరగతులు నిర్వహించేందుకు ఎలాంటి అనుమతులు లేవని ఆర్ఐఓ వెంకటసుబ్బయ్య గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఇటువంటి గుర్తింపు లేని కళాశాలల్లో తమ పిల్లలను చేర్పించవద్దని, అలా చేర్పిస్తే ఆర్ఐఓ కార్యాలయం కానీ, ఇంటర్మీడియట్ విద్యా మండలి కానీ బాధ్యత వహించదన్నారు. అడ్మిషన్ నోటిఫికేషన్ కంటే ముందే ప్రవేశాలు చేస్తున్నట్లు, వేసవి సెలవుల్లో తరగతులు నిర్వహిస్తున్నట్లు, అధిక ఫీజులు వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు అందితే ఆయా కళాశాలల గుర్తింపు రద్దుకు సిఫారసు చేస్తామన్నారు.

విజిలెన్స్ దాడులు.. రూ.60వేల జరిమానా



తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు

కడప (క్రైం), మే 23 : కడప రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారి షేక్ మసుంబాషా ఆదేశాల మేరకు గురువారం కడప విజిలెన్స్ అధికారులు విమ ఫుడ్ ప్రొడక్ట్స్, ఎస్‌కే ఎంటర్‌ప్రైజస్‌లలో తనిఖీలు చేపట్టారు. సరైన డిక్లరేషన్, తయారీ తేది లేక పోవడం, అపరిశుభ్ర పరిసరాలు ఉండడంతో కేసులు నమోదు చేసి రూ.60వేలు జరిమానా విధించారు. ఈ తనిఖీల్లో కడప విజిలెన్స్ అధికారులు రెడ్డప్ప, పోలీసు అధికారి మురళీక్రిష్ణ, ఫారెస్టు రేంజర్ ఆఫీసరు బాలగంగాదర్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, లీగల్ మెట్రాలజీ ఇన్స్‌పెక్టరు సునీల్ కుమార్, కడప కార్పొరేషన్ శానిటరీ ఇన్స్‌పెక్టరు పాల్గొన్నారు.

కువైత్‌లో అట్లూరు మండల వాసి మృతి



అట్లూరు, మే 23: అట్లూరు మండలం కామసముద్రం వాసి ఈటె అయ్యవారయ్య (38) గురువారం ఉదయం కువైత్‌లో గుండెపోటుతో మరణించినట్లు మృతుని బంధువులు తెలిపారు. ఇతనికి భార్య లక్షుమ్మ ఒక కూతురు ఒక కొడుకు ఉన్నారు. అయ్యవారయ్య నాలుగేళ్లగా కువైత్‌కు పోతూ వస్తూ ఉండేవాడని అక్కడ బిల్డింగ్ పనులు చేస్తూ జీవనం సాగిస్తూ ఉండేవాడు. గురువారం ఉదయం భార్య లక్షుమ్మకు ఫోన్ చేసి మాట్లాడినట్లు బంధువులు తెలిపారు. తరువాత అకస్మాత్తుగా గుండెపోటుతో మరణించినట్లు వారు తెలిపారు. కుటుంబ యజమాని మరణంతో గ్రామంలోని కుటుంబ సభ్యులు, బంధువులు శోక సముద్రంలో మునిగారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

సీకేదిన్నె, మే 23: చింతకొమ్మదిన్నె మండలం కొప్పర్తి చెరువులో గుర్తు తెలియని మృతదేహాన్ని పోలీసులు కనుగొన్నారు. చింతకొమ్మదిన్నె సీఐ శివశంకర్‌నాయక్ అందించిన వివరాల మేరకు దాదాపు 40 సంవత్సరాల వయస్సుగల వ్యక్తి వారం, పది రోజుల క్రితం చెరువులో మృతిచెందినట్లు తెలిపారు. ఇతని కుడిచేతికి తెల్లని కడియం కూడా ఉందని, ఇతని మృతికిగల కారణాలు తెలియాల్సి ఉందన్నారు. గుర్తు తెలియని శవంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రైలుకింద పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి




ముద్దనూరు మే23: మండల పరిధి మంగపట్నం రైల్వే స్టేషన్ సమీపంలో గురువారం గుర్తుతెలియని వ్యక్తి రైలు కిందపడి మృతి చెందినట్లు ఎర్రగుంట్ల రైల్వే హెడ్ కానిస్టేబుల్ రాజారాంరెడ్డి తెలిపారు. మృతునికి 40 ఏళ్ల ఉంటాయన్నారు. టీషర్టు, షార్టు ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు , ఆచూకీ తెలిసిన వారు ఎర్రగుంట్ల పోలీసులను సంప్రదించాలన్నారు.

ప్రమాదవశాత్తు ట్రాక్టర్ కిందపడి యువకుడు మృతి



చిట్వేలి, మే 23: చిట్వేలి-గరుగుపల్లె రహదారిలోని సాయిబాబా ఆలయం వద్ద ప్రమాదవశాత్తు ట్రాక్టర్ కిందపడి యువకుడు మృతి చెందిన ఘటన గురువారం చోటు చేసుకుంది. మైలపల్లె అరుంధతీవాడకు చెందిన కేతరాసుపల్లె చందు (18) ఇంటర్మీడియట్ చదువుతున్నాడు. మైలపల్లె నుంచి చిట్వేలికి మామిడికాయల లోడుతో వెళ్తున్న ట్రాక్టర్‌ను బైకులో వెళుతున్న చందు ఓవర్ టేక్ చేస్తుండగా అదుపుతప్పి ప్రమాదవశాత్తు ట్రాక్టర్ కిందపడ్డాడు. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



10th, ఇంటర్, డిగ్రీ పాసయ్యే ఛాన్స్
చదువు మధ్యలో ఆపేసిన లేదా ఫెయిల్ అయిన వారికి 10th, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, P.G., B.Tech., MBA, M.Tech. పాసయ్యేచాన్స్ కలదు. నగేష్ అకాడమి, కడప. సెల్ : 7569470023
Ajc-188574

అర్జంటుగా కావలెను
APSRTC రాజంపేట డిపో నందు బస్సులు వాషింగ్ చేయుటకు వాషింగ్ బాయ్స్ కావలెను. ఆకర్షణీయమైన జీతం, సంప్ర : 80080 81149
Ajc-188760

10th,ఇంటర్,డిగ్రీ పాసయ్యే ఛాన్స్
చదువు మధ్యలో ఆపేసిన (లేదా) ఫెయిల్ అయిన వారికి 10th, ఇంటర్, డిగ్రీ పాసయ్యే ఛాన్స్ కలదు. కడప సెల్: 90105 01122.
Ajc-188573

EDUCATION
విజయవాడలో B.P.T, B.Sc., MLT (ల్యాబ్ టెక్నీషియన్), DMLT, అనస్తీషియా, కార్డియాక్ కేర్, ఆపరేషన్ థియేటర్, డయాలసిస్ టెక్నీషియన్ కోర్సులు. అర్హత : ఇంటర్. SC / ST / BC స్కాలర్ షిప్ / ఫ్రీ సీట్లు కలవు. సంప్ర : 79959 45835
AJB - 182326

బంగారం కొనబడును
మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్ర॥ 7382114647
AJA- 177000

ఆంధ్రజ్యోతిలో ప్రకటనల కోసం సంప్రదించండి

యూనిట్ కార్యాలయం
9985411183
9985411189

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

అంత్యక్రియలు



అమ్మిరెడ్డి సంజీవరెడ్డి గారు
శ్రీ వరదా అగ్రిటెక్ ప్రై. లిమిటెడ్, ప్రొద్దుటూరు.
అధ్యక్షులు : శ్రీ షిర్డి సాయిబాబా సేవా సమితి, మైదుకూరు.
మంచితనానికి మారుపేరుగా నిలిచి, అందరిని ఆప్యాయంగా పలుకరించే అమ్మిరెడ్డి సంజీవరెడ్డి గారు 23-05-24వ తేదీన ఆకస్మికంగా స్వర్గస్తులైనారు.
వారి ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తున్నాం.
కుటుంబ సభ్యులు
అంత్యక్రియలు : 24-05-24వ తేది శుక్రవారం మైదుకూరు మండలం ఢాంఖాన్‌పల్లెలో మధ్యాహ్నం 3 గంటలకు జరుగును.

కనుమరుగైన కోళ్ల పరిశ్రమలు

- పెట్టుబడి ఎక్కువ.. ఆదాయం తక్కువ
- పెరిగిపోయిన దాణాఖర్చులతో భారీ నష్టాలు
- పూర్తిగా కోళ్ల ఫారాల మూసివేసిన నిర్వాహకులు

రాజంపేట, మే 24: రాజంపేటలో కోళ్ల పరిశ్రమలు కనుచూపుమేరలో కనిపించకుండా పోయాయి. ఏడేళ్ల కిందట ఒకరిద్దరు సాహసించి సుమారు అరకోటి పైబడి ఖర్చు చేసి ఏర్పాటు చేసిన కోళ్లపరిశ్రమ వల్ల లాభాలు అటుంచి భారీ నష్టాలు రావడంతో మూసివేశారు. ఈ కోళ్ల పరిశ్రమ పెట్టుకోవడం కంటే ఒక చిన్న బంకు పెట్టుకోవడమే మేలంటూ పరిశ్రమను వదిలేశారు. పని ఎక్కువ.. పెట్టుబడి ఎక్కువ, ఆదాయం మాట దేవుడెరుగు.. నష్టాల రావడంతో కోళ్ల పరిశ్రమ ఊసే ఎత్తేవారు లేకుండా పోయారు.

రాజంపేటతో పాటు జిల్లాలో కోళ్ల పరిశ్రమ అంటూ ఒకటి రెండు చోట్ల తప్ప ఎక్కడా లేవు. చిత్తూరు, మదనపల్లె ప్రాంతాల నుంచి ఇక్కడికి బాయిలర్ కోళ్లను దిగుమతి చేసుకుంటున్నారు. దీంతో ప్రస్తుతం చికెన్ ధర రాజంపేట ప్రాంతంలో ఆకాశాన్నంటుతున్నాయి. కిలో చికెన్ 265 రూపాయల వరకు ధర పలుకుతోంది. ఒక కిలో చికెన్ దూర ప్రాంతాల నుంచి తేవడానికి 200 రూపాయల వరకు అవుతుంది. ఒక కోడి ఒకటిన్నర కిలో నుంచి రెండు కిలోలు పడుతుంది. ఈ విధంగా ఒక కోడి ఖర్చు 300 నుంచి 400 పలుకుతుంది. ఏమీ చేయలేని పరిస్థితుల్లో చిత్తూరు కోళ్ల ఫారాల వద్దకు వెళ్లి ఈ వ్యాపారం చేసుకుంటున్నారు.

సాధారణంగా కోళ్ల పరిశ్రమ ఏర్పాటు చేయాలంటే ఒక అర ఎకరా స్థలంలో 50 లక్షల వరకు ఖర్చు చేసి షెడ్లు వేసి నెల్లూరు, విజయవాడ, చిత్తూరు ఇతర ప్రాంతాల నుంచి చిన్న కోళ్లను కొనుగోలు చేసి కోళ్లఫారాలు పెట్టడం గతంలో జరిగింది. ఒక్క కోడిపిల్ల గతంలో 20-25 రూపాయల వరకు ధర ఉండేది. అయితే అనేక కారణాల వల్ల నేడు ఆ ధర 50 రూపాయల వరకు చేరింది. ఆ కోడి పిల్లలను తీసుకువచ్చి 45 రోజుల వరకు పెంచుతారు. ఒక్కో కోడికి దాణా ఖర్చు 150 రూపాయల నుంచి 170 రూపాయల వరకు వస్తుంది. ఒక్కో కోడి రెండు కేజీల వరకు పడుతుంది. కోడి పిల్ల ఖర్చు, దాణా ఖర్చు అన్నీ కలిపి 220 రూపాయల వరకు అవుతుంది. వాటిని సరైన సమయంలో అమ్మితే కోడికి


అలంకార ప్రాయంగా మారిన కోళ్ల పరిశ్రమ షెడ్లు

బాయిలర్ కోళ్లు లేకపోవడంతో చూపుడాయకంగా ఉన్న నాటుకోళ్లు

50 రూపాయల వరకు గిట్టుబాటు అవుతుంది. అయితే ప్రస్తుతం దాణా ఖర్చు భారీగా అవుతోంది. మొక్కజొన్న, సోయా, పొట్టు అన్నీ మిక్స్ చేసి వాటికి దాణాగా వాడతారు. అయితే ఖర్చులు భారీగా పెరగడం, ఇక్కడి కోళ్లకు అంత డిమాండ్ లేకపోవడంతో ఎవ్వరూ వీటిని పెంచడానికి ముందుకు రావడం లేదు. పెట్టిన పెట్టుబడులకు వడ్డీలు కట్టలేని పరిస్థితిలో వీటినుంచి లాభాలు అటుంచి నష్టాలు భారీ ఎత్తున వస్తున్నాయి. దీంతో ఏమీ చేయలేక కోళ్ల పరిశ్రమలను వదిలేశారు. ఇక్కడి చికెన్ షాపు దుకాణాదారులు చిత్తూరు జిల్లా నుంచి కోళ్లను దిగుమతి చేసుకుంటూ ఉంటారు.

వయోజన బీసీజీ టీకాతో టీబీ వ్యాధికి చెక్

- డీపీయంవో డాక్టర్ రియాజ్‌బేగ్


బీసీజీ టీకా కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డీపీఎంవో

రాయచోటిటౌన్, మే 23: క్షయ (టీబీ) వ్యాధి లేని భారతదేశం లక్ష్య సాధనకు వయోజన బీసీజీ టీకాలు భారత ప్రభుత్వం ప్రవేశ పెట్టిందని జాతీయ ఆరోగ్య మిషన్ అన్నమయ్య జిల్లా పర్యవేక్షణ అధికారి (డీపీఎంవో) డాక్టర్ రియాజ్‌బేగ్ అన్నారు. గురువారం ఆయన రాయచోటి మున్సిపాలిటీ పరిధిలోని వాల్మీకి స్ట్రీట్‌లో గల అర్బన్ పీహెచ్‌సీ పరిధిలోని రెడ్డివారిపల్లె, ఈడిగపల్లెలో వయోజన బీసీజీ టీకా సెషన్‌ను డీఎస్‌యంవో డాక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డితో కలిసి తనిఖీ చేశారు. అనంతరం ప్రజలకు వయోజన బీసీజీ టీకాపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో టీబీ రాకుండా ముందస్తు నివారణ చర్యల్లో భాగంగా వయోజన బీసీజీ టీకా కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 16న ప్రారంభించి అర్హులైన లబ్ధిదారులకు బీసీజీ టీకాలు ఇచ్చారన్నారు. ఎవరు ఎలాంటి అనుమానాలకు తావు లేకుండా టీకా వేసుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో వాల్మీకి స్ట్రీట్ వైద్యులు, ఆరోగ్య సిబ్బంది, ఆశాకార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

చిటికె వ్యాధి నివారణకు టీకాలు వేయించాలి


గొర్రెలకు టీకాలు వేస్తున్న పశువైద్యాధికారులు

రామాపురం, మే 23: గొర్రెలకు, మేకలకు చిటికె వ్యాధి సోకకుండా నివారించేందుకు టీకాలు తప్పనిసరిగా వేయించాలని జిల్లా పశువర్ధకశాఖ అధికారి గుణశేఖర్‌పిళ్లై తెలిపారు. మండ లంలో గోపగుడిపల్లె, నీలకంఠ్రావుపేట, టీ.రాచపల్లె గ్రామాల్లో గురువారం జరుగుతున్న వ్యాక్సిన్ కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 53వేల గొర్రెలు, మేకలు ఉన్నాయని, మొదటి విడతగా 20వేల గొర్రెలకు వ్యాక్సిన్ వచ్చిందన్నారు. మొదటి విడతగా గతంలో చిటికె వ్యాధి వ్యాపించిన గ్రామాల్లో వ్యాక్సిన్ వేస్తున్నట్లు తెలిపారు. రెండో విడతలో మిగిలిన గ్రామాల్లోని గొర్రెలకు టీకాలు వేస్తామన్నారు. గొర్రెల పెంపకందారులు తప్పక టీకాలు వేయించుకోవాలని తెలిపారు. లక్కిరెడ్డిపల్లె పశుసంవర్ధకశాఖ ఉప సంచాలకులు డాక్టర్ మాలకొండయ్య, మండల పశు వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్, పశుసంవర్ధకశాఖ సహాయకులు రేవతి, రాజకుమారి, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.



అలజడులు సృష్టిస్తే చర్యలు తప్పవు : డీఎస్పీ


సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ రామచంద్రరావు

రామాపురం, మే 23: ఎన్నికల కౌంటింగ్ రోజు గ్రామాల్లో అలజడలు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ పి.రామచంద్రరావు హెచ్చరించారు. స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో గురువారం మండలానికి సంబంధించిన పలువురు నాయకులు, ప్రజలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యగా గ్రామాల్లో అనుమానం వచ్చిన ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించామన్నారు. ఎన్నికల ఫలితాలు రోజు ర్యాలీలు, సభలు, సమావేశాలు, సంబరాలు, టపాసులు కాల్చడం వంటివి చేయకూడదన్నారు. జూన్ 6వ తేదీ వరకు ఎన్నికల కోడ్ ఉంటుందని, ప్రతి ఒక్కరూ దీన్ని దృష్టిలో పెట్టుకోవాలన్నారు. 4వ తేదీ కౌంటింగ్ కేంద్రం వద్ద ఉండకుండా ఇంటి వద్దనే ప్రశాంతంగా టీవీలలో చూసుకోవచ్చని తెలిపారు. ఎన్నికల ఫలితాల రోజు 144 సెక్షన్ అమలులో ఉంటుందని.. ఘర్షణలకు పాల్పడితే మీ పిల్లల భవిష్యత్తు నాశనమవుతుందన్నారు.

కార్యక్రమంలో లక్కిరెడ్డిపల్లె సీఐ గంగ నాధ్‌బాబు, ఎస్‌ఐ వీఎల్ ప్రసాద్‌రెడ్డి, ఏఎస్‌ఐ శ్రీనివాస్‌శర్మ, పోలీసులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


అగస్తేశ్వరాలయంలో మొలకల పౌర్ణమి పూజలు


అగస్తేశ్వరస్వామి ఆలయంలో గణపతిహోమం నిర్వహిస్తున్న దృశ్యం

రాయచోటిటౌన్, మే 23: పాతరాయచోటిలో వెలిసిన ప్రాచీన అగస్తేశ్వరస్వామి ఆలయంలో గురువారం మొలకల పౌర్ణమి పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో స్వామి వారికి గణపతి హోమం నిర్వహించి ద్రాక్షాయణి సమేత అగస్తేశ్వరస్వామి పల్లకీ ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే పాతరాయచోటికి సమీపంలోని తోపు గంగమ్మ ఆలయంలో మొలకల పౌర్ణమి పూజలు నిర్వహించి కలశారాధన చేపట్టారు. మొక్కుబడులు ఉన్న వివాహం కానీ వారు, సంతానం లేని వారు కలశాలు ఏర్పాటు చేసి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అమ్మవారి పల్లకీ ఉత్సవాన్ని వైభవంగా చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కాలభైరవస్వామి ఆలయంలో....

రాయచోటి మండల పరిధిలోని యండపల్లి గ్రామం ముసల్‌రెడ్డిగారిపల్లెకు సమీపంలో భైరవగుట్టపై వెలిసిన కాలభైరవస్వామి తిరుణాలలో భాగంగా రెండవరోజు మొలకల పౌర్ణమిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం 6 గంటలకు గణపతిపూజ, స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తజనం పెద్ద ఎత్తున తరలివచ్చి కాలభైరవ స్వామిని దర్శించుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. అనం తరం విద్యుత్ దీపాలంకరణలతో ఏర్పాటు చేసిన చాందినీ బండ్లు ఆలయం చుట్టూ ప్రదక్షిణ నిర్వహించారు.


ప్రత్యేక అలంకరణలో కాలభైరవుడు

టీడీపీ గెలుపు తథ్యం


బాలసుబ్రమణ్యంను సన్మానిస్తున్న నాయకులు

వీరబల్లి, మే 23: వచ్చే ఎన్నికల ఫలితాల్లో టీడీపీ విజయం తప్పక గెలుస్తుందని రాజంపేట టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం అన్నారు. వీరబల్లి హరిహరాదులాలయంలో జరుగుతున్న మొలకలపౌర్ణమి ప్రత్యేక పూజలకు, ఈడిగపల్లిలో జరుగుతున్న లక్ష్మీనారాయణుల కల్యాణోత్సవానికి ఆయన విచ్చేసి ప్రత్యేక పూజలు చేశారు. ఆయనతో పాటు రాష్ట్ర టీడీపీ కార్య నిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్‌బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ రాజంపేటలో కూడా టీడీపీ జెండా ఎగురవేస్తామన్నారు. అనంతరం టీడీపీ మండల నాయకులు భానుగోపాల్‌రాజు, టీ.శ్రీధర్‌రెడ్డి, వై. రెడ్డెప్పరెడ్డిలతో పాటు పలువురిని పోలింగ్ సరళి గురించి అడిగి తెలుసుకున్నారు.

ఘనంగా అన్నమయ్య జయంతి వేడుకలు


అన్నమయ్య జయంతి వేడుకల్లో పాల్గొన్న కళాకారులు

రాయచోటిటౌన్, మే 23: రాయచోటి పట్టణంలోని కలెక్టరేట్‌కు సమీపంలో గల గుండాంజనేయస్వామి దేవాలయంలో అయ్యప్ప సేవాసొసైటీ ఆధ్వర్యంలో గురువారం అన్నమయ్య జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నమయ్య కూడలి వద్ద శ్రీమంత్ర రాజపీఠం ఢిల్లీ స్వామిజీ సింహయాజీ అన్నమయ్య విగ్రహానికి పూలమాల వేసి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాకారులు అత్యంత మనోహరంగా అన్నమయ్య కీర్తనలు ఆలపించారు. సంగీత కళారత్నం శ్రీయరగొల్ల శ్రీనివాస్‌యాదవ్, మాస్టర్ భజన గురువు తుమ్మల హరినాధ్, అయ్యప్ప సేవా సొసైటీ అధ్యక్షుడు బసిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. భక్తులకు, కళాకారులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

వైభవంగా కోదండరాముని కల్యాణం


సీతారాముల కల్యాణం దృశ్యం

ఒంటిమిట్ట, మే 23: ఒంటిమిట్ట కోదండరామాలయంలో పౌర్ణమిని పురస్కరించుకుని గురువారం సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ముందుగా ఉత్సవ మూర్తులైన సీతారాములను ప్రత్యేకంగా అలంకరించి కల్యాణ మండపం వద్ద ఉంచి కల్యాణాన్ని ప్రారంభించారు.

ముందుగా విచక్షణ పూజ, పుణ్యాహవచనం, కంకణదారణ, యజ్ఞోపవితరణ అనం తరం మాంగళ్యదారణను వైష్ణవ సాంప్రదాయంలో టీటీడీ అర్చకులు నిర్వహించారు. అనంతరం తలంబ్రాలు సమర్పణ పూలజడల మార్పిడి నిర్వహించి కల్యాణ పండితులు ముగించారు. ఈకల్యాణోత్సవంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

వేరుశనగ విత్తనకాయలను నమోదు చేసుకోండి

సంబేపల్లె, మే 23: ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ పంట సాగు చేసే రైతులు సబ్సిడీ విత్తన కాయల కోసం నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి కిశోర్‌నాయక్ తెలిపారు. మండలానికి 2420 క్వింటాళ్ల నారాయణి రకం వేరుశనగ విత్తనకాయలు మంజూరైనట్లు తెలిపారు. పంటసాగు చేసే రైతులు వారి ఆధార్, భూమి పాసుపుస్తకాలు తీసుకొని ఆయా గ్రామాల రైతు భరోసా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. 30 కేజీల బ్యాగు ధర రూ.1764 నిర్ణ యించి నట్లు తెలిపారు. పంటసాగు చేసే రైతులు డబ్బులు చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకో వాలన్నారు. విత్తనకాయలు వచ్చిన వెంటనే రైతులకు పంపిణీ చేస్తామన్నారు.

నేటి నుంచి దొనకొండ గంగాభవానీ అమ్మవారి జాతర

గాలివీడు, మే 23: మండలంలోని అరవీడు గ్రామం కసిరెడ్డిగారిపల్లె, రెడ్డివారి పల్లె సరిహద్దుల్లో పవిత్ర కుషావతి నదీ తీరాన వెలిసిన దొనకొండ గంగాభవానీ అమ్మవారి జాతర 25, 26వ తేదీల్లో వైభవంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అందులో భాగంగా 25వ తేదీ శనివారం సాయంత్రం కూర్మయగారిపల్లె నుంచి వీరతాళ్ల పెట్టెలతో పూజారులు, భక్తులు ఆలయం వద్దకు చేరుకుంటారు. సిద్దలకూడు నైవేద్యంతో నిండు తిరుణాలగా మారుతుంది. రాత్రికి చెంచునాటకం, చెక్కభజనలు, విద్యుత్ కాంతులతో అలంకరించిన చాందినీ బండ్ల ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు. 26వ తేదీ ఉదయం అమ్మవారి రథోత్సవం, బోణాల కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

ముగిసిన ఆంజనేయస్వామి తిరుణాల



సుండుపల్లె, మే 23: మండలంలోని గుండ్లపల్లి గ్రామ పంచాయతీలో గత మూడు రోజుల నుంచి జరుగుతున్న ఆంజనేయ స్వామి తిరుణాల ఘనంగా ముగిసింది. తిరుణాలలో భాగంగా ప్రత్యేక పూజలు, అభిషేకం కార్య క్రమాలు నిర్వహించారు. బుధవారం రాత్రి, గురువారం ఉదయం రంగురంగుల విద్యుత్ దీపాల అలంకరణలతో చాందినీ బండ్లు దర్శనమిచ్చాయి. మొక్కుబడులు ఉన్న భక్తులు చాందినీ బండి కట్టి మొక్కులు తీర్చుకున్నారు. మండలంతో పాటు పక్క మండలాల నుండి సైతం పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై తిరుణాల మహోత్సవాన్ని తిలకించారు.

PUBLIC NOTICE

Under the instructions of my client M/s Shriram Finance Ltd.Rajampet Branch, Rajampet Post & Mandal, Annamaiah Dist. A.P. I hereby given the public notice that **Obili Lakshumma W/o Changal Rayudu** aged 55 years, Hindu, House Wife, D.No. 2/37, Arundhathiwada, Obnapalle Village, Rly. Kodur Post & Mandal, Annamaiah Dist. A.P. 516 129, applied for a loan from my clients Finance Ltd., by mortgaging the schedule mentioned property which stands in his name. If anybody has got any objections with regard to the schedule mentioned property, file their objections before my clients Office or in my Office within 5 days of this publication, failing which loan will be sanctioned and issued to the applicant. **SCHEDULE** The propery is situated at Kadapa District, presently Annamaiah Dist. Pullampet Sub-Dist. Kodur Grama Panchayath, 10th Ward, Eastern Side to Kadapa - Tirupathi Main Road, Residential Area, Kodur Grama Polam, Situated in Sy.No. 66/1, R.C.C. Building bearing D.No. 10/496-4 **Boundaries :** East : 6 Feet width Sandhu Rastha, West : 12 Feet Sandhu Rastha, North : Site of Kotha Subbarayulu, South : Others Site, **Site Measurements** : East to West : 50 Feet (15.24 Mts) North to South: 11 1/4 feet or (3.42 Mts.) Total Site is 62.50 Chadarapu Gajamulu. **R.C.C. Building Measurements :** East to West : 50 Feet (15.24 Mts) North to South: 11 1/4 feet or (3.42 Mts.) Total Site is 562.50 Chadarapu Gajamulu. With Doors, Door Frames, Windows, Window Frames, Almarahs, Current Meter No. 16371 with wiring , Full right over the lengthy wall on the northern side and 1/2 Share on the southern side on lengthy wall with easement rights.

S. KRISHNA KUMAR, M.A. B.L.
S. GIREESH KUMAR, M.Tech. LLM
Advocates, Rajampet

PUBLIC NOTICE

Under instructions from my client M/s Shriram Finance Limited, RAYACHOTY Branch. I issue the following notice. My client company intends to grant a loan facility to **Kum. Rasala Sasikala D/o R.Sreeramulu, D.No. 13-120, Vallepu Street, Vempalli Town, Post, Mandal,** Y.S.R. Kadapa District under equitable mortgage by way of deposit of title deeds in respect of the schedule mentioned property. Hence the public at large, banks, financial institutions or any individual money lenders are hereby informed that if any objections regarding the said loan, the public shall inform in writing within seven days from the date of this notice for the below mentioned schedule property, otherwise it shall be deemed that there are no objection from anybody and any objections received after seven days will not binding upon my client's company for the below schedule property.

SCHEDULE OF PROPERTY:- Item No.1: Annamayya District erstwhile YSR Kadapa District, T.Sundupalli Sub.Reg. Dist., Sambepalli Mandal at **Motakatla Village Polam** in with **Plot No. 05**, Sy.No. 772 an extent of Ac. 2.46 cents, Sy.No. 773/1 an extent of Ac. 0.29 cents, Sy.No. 773/2 an extent of Ac. 0.48 cents, Sy.No. 773/3 an extent of Ac. 0.12 cents, Sy.No. 773/4 an extent of Ac. 0.01 cents, Sy.No. 773/5 an extent of Ac. 0.81 cents, Sy.No. 773/6 an extent of Ac. 0.43 cents, Sy.No. 826/1 an extent of Ac. 0.83 cents, Sy.No. 826/2 an extent of Ac. 4.50 cents, Sy.No. 834/1 an extent of Ac. 1.67 cents, Sy.No. 835/2 an extent of Ac. 6.83 cents, Sy.No. 835/3 an extent of Ac. 0.07 cents, Sy.No. 835/4 an extent of Ac. 0.56 cents, Sy.No. 835/5 an extent of Ac. 0.74 cents, Sy.No. 836/1 an extent of Ac. 2.66 cents, Sy.No. 837/1 an extent of Ac. 2.00 cents, Sy.No. 837/2 an extent of Ac. 0.19 cents Out of it 166.66 Square Yards, **Bounded by:** East - Site in Plot No.6A, West - 34 feets width Road, North - Site in Plot No.4, South - Site in Plot No.6. **Measuring :** East - West (Length) = 50 feets, North - South (Width) = 30 feets.

Item No.2: Annamayya District erstwhile YSR Kadapa District, T.Sundupalli Sub.Reg. Dist., Sambepalli Mandal at **Motakatla Village Polam** in with Plot No. 06A, Sy.No. 772 an extent of Ac. 2.46 cents, Sy.No. 773/1 an extent of Ac. 0.29 cents, Sy.No. 773/2 an extent of Ac. 0.48 cents, Sy.No. 773/3 an extent of Ac. 0.12 cents, Sy.No. 773/4 an extent of Ac. 0.01 cents, Sy.No. 773/5 an extent of Ac. 0.81 cents, Sy.No. 773/6 an extent of Ac. 0.43 cents, Sy.No. 826/1 an extent of Ac. 0.83 cents, Sy.No. 826/2 an extent of Ac. 4.50 cents, Sy.No. 834/1 an extent of Ac. 1.67 cents, Sy.No. 835/2 an extent of Ac. 6.83 cents, Sy.No. 835/3 an extent of Ac. 0.07 cents, Sy.No. 835/4 an extent of Ac. 0.56 cents, Sy.No. 835/5 an extent of Ac. 0.74 cents, Sy.No. 836/1 an extent of Ac. 2.66 cents, Sy.No. 837/1 an extent of Ac. 2.00 cents, Sy.No. 837/2 an extent of Ac. 0.19 cents Out of it 233.33 Square Yards, **Bounded by:** East - Kadapa-Chittoor National Highway Road, West - Site in Plot No.5, North - Site in Plot No.5A, South - Site in Plot No.7A. **Measuring :** East - West (Length) = 70 feets, North - South (Width) = 30 feets.(Property covered in registered sale deed No. 2307/2022, 2308/2022


C. SUNIL KUMAR REDDY, B.A., B.L.
ADVOCATE, Rayachoty, 9441738746



సకాలంలో విత్తనాలు అందించేందుకు కృషి : ఏవో

రాయచోటిటౌన్, మే 23: ఖరీఫ్ సాగుకు అవసరమైన వితతనాలను రైతులకు సకా లంలో అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని మండల వ్యవసాయ అధికారి దివాకర్‌బాబు అన్నారు. గురువారం రాయచోటి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పల్లవు రాజమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఇప్పటికే రైతు భరోసా కేంద్రాల్లో విత్తనవుకాయలు కోసం రైతుల రిజిస్ట్రేషన్ కార్యక్రమం ప్రారంభించామన్నారు. అర్హులైన వారందరికీ విత్తనాలు అందజేస్తామన్నారు. ప్రస్తుతం పచ్చిరొట్టి ఎరువులు తయారు చేసేందుకు అవసరమైన జీలుగ, జనుము, పిల్లి పెసర లాంటి విత్తనాలను అందిస్తున్నామని.. రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఆర్‌డబ్ల్యుఎస్ అధికారి మాట్లాడుతూ మండలంలో ఎక్కడైన తాగునీటి సమస్య ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఐసీడీఎస్ సూపర్ వైజర్ మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు, గర్భవతులకు, బాలిం తలకు పౌష్టికాహారాన్ని సకాలంలో అందిస్తున్నామని.. ఎక్కడైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సభ్యులను కోరారు.



గజ గణనకు నోడల్ జిల్లాగా చిత్తూరు



చైతన్యకుమార్‌రెడ్డి

చిత్తూరు (సెంట్రల్), మే 23 : గజ గణనకు సౌత్ ఇండియాకు కర్ణాటక నోడల్ రాష్ట్రంగా, ఏపీకి చిత్తూరు నోడల్ జిల్లాగా ఉంటుందని డీఎఫ్‌వో చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన తన ఛాంబర్‌లో మీడియాతో మాట్లాడుతూ ఏకకాలంలో అన్ని అటవీ ప్రాంతాల్లో ఏనుగుల గణన జరుగుతోందన్నారు. రాష్ట్రంలో చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య, అనంతపురం, పార్వతీపురం, విజయనగరం జిల్లాల్లో గణన చేపట్టనున్నట్లు తెలిపారు. చిత్తూరు 120, తిరుపతి, అన్నమయ్య జిల్లాల్లో 40, పార్వతీపురం, విజయనగరంలో 14 వరకు ఏనుగులు ఉంటాయని ప్రాథమిక అంచనా వేశారని పేర్కొన్నారు. విద్యుదాఘాతం ఇతర కారణాలతో ఏటా 8 నుంచి 10 ఏనుగులు మృతి చెందుతుండగా, వాటి బారినపడి ఏటా తొమ్మిది మంది ప్రాణాలు కోల్పోతున్నారని వివరించారు. ఏనుగులు, ప్రజల మరణాల నివారణకు అటవీ శాఖ తగు చర్యలు చేపట్టినట్లు వివరించారు.

కాణిపాకంలో వైభవంగా పున్నమి గరుడ సేవ



గరుడ వాహనంపై ఊరేగుతున్న వరదరాజస్వామి

ఐరాల(కాణిపాకం),మే 23: కాణిపాకంలో వెలసిన వరదరాజస్వామి ఆలయంలో గురువారం పున్నమి గరుడ సేవను వైభవంగా నిర్వహించారు. ఉదయం వరదరాజస్వామి మూల విరాట్‌కు అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో భక్తుల ఆధ్వర్యంలో సత్యనారాయణ స్వామి పూజ, వ్రతం నిర్వహించారు. రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత వరదరాజస్వామి ఉత్సవ విగ్రహాలను గరుడ వాహనంపై కాణిపాక వీధులలో ఊరేగించారు. స్వామి దర్శనార్థం వందలాది మంది భక్తులు వచ్చారు. ఈవో వెంకటేశు, ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి, సూపరింటెండెంట్లు శ్రీధర్‌బాబు, కోదండపాణి, ఆలయ ఇన్‌స్పెక్టర్లు రమేష్, విఘ్నేష్ పాల్గొన్నారు.

ముక్కంటి ఆలయంలో రద్దీ



శ్రీకాళహస్తి, మే 23 : శ్రీకాళహస్తీశ్వరాలయం గురువారం భక్తజనసంద్రంగా మారింది. పౌర్ణమిని పురస్కరించుకుని రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి కూడా భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. సుమారు 27వేలమంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రూ.200 శీఘ్ర దర్శనం టిక్కెట్ల ద్వారా 6457మంది, రూ.50ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా 1,667మంది భక్తులు దర్శించుకున్నారు. ఇక రూ.500 రాహుకేతు టిక్కెట్ల ద్వారా 1,850మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 488మంది, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 197మంది, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 148మంది, రూ.5వేల టిక్కెట్ల ద్వారా 50మంది భక్తులు పూజలుచేయించుకున్నారు. ఇక ఐదు రకాల ప్రసాదాలు కలిపి 15,049అమ్ముడైనట్లు ఆలయ అధికారులు తెలిపారు.

నేటినుంచి పాలిసెట్ కౌన్సెలింగ్

తిరుపతి(విద్య), మే 23: పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించిన ఏపీ పాలిసెట్ కౌన్సెలింగ్ శుక్రవారం నుంచి ప్రారంభంకానుంది.పాలిసెట్ ర్యాంకర్లు 24నుంచి జూన్2లోపు ఆన్‌లైన్‌లో ప్రాసెసింగ్ ఫీజు చెల్లించాలని తిరుపతిలోని ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ డాక్టర్ వై.ద్వారకనాథరెడ్డి సూచించారు.ర్యాంకుల వారీగా 27నుంచి జూన్ 3వతేదీవరకు ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఉంటుందని, విద్యార్థులు సంబంధిత ఒరిజనల్ సర్టిఫికెట్లతోపాటు రెండుసెట్ల జిరాక్స్ కాపీలను వెంట తీసుకురావాలని తెలిపారు. మే 31నుంచిజూన్5లోపు ఆప్షన్లు నమోదుచేసుకోవాలని, చివరిరోజు ఆప్షన్లలో మార్పులకు, చేర్పులకు అవకాశం ఉందని వివరించారు. జూన్ 7న విద్యార్థుల సెల్‌ఫోన్ నెంబర్లకు సీటు అలాట్‌మెంట్ సమాచారం అందుతుందని, 10నుంచి తరగతులు ప్రారంభమవుతాయని తెలిపారు. స్పెషల్ కేటగిరీ విద్యార్థులు (పీహెచ్, సీఏపీ, ఎన్‌సీసీ, స్పోర్ట్స్ అండ్ గేమ్స్)విజయవాడలోని గవర్నమెంట్ పాలిటెక్నిక్‌లో నిర్వహించే కౌన్సెలింగ్‌కి హాజరై తమ ధ్రువపత్రాలను పరిశీలన చేసుకోవాలని సూచించారు. పాలిసెట్‌లో అర్హత సాధించిన విద్యార్థులు హెచ్‌టీటీపీఎస్://ఏపీపాలిసెట్.ఎన్ఐసీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో ప్రాసెసింగ్ ఫీజును చెల్లించాలన్నారు.

- ర్యాంకులవారీగా ధ్రువపత్రాల పరిశీలన తేదీలు ఇలా: 27న ఒకటినుంచి 12వేలర్యాంకుల వరకు, 28న 12,001-27,000వరకు, 29న 27,001-43,000వరకు, 30న 43,001-59,000వరకు, 31న 59,001-75,000వరకు, జూన్1న 75,001-92,000వరకు, 2న 92,001-108000వరకు, 3న 108001-చివరిర్యాంకు వరకు విద్యార్థులు హాజరై తమ ధ్రువపత్రాలను వెరిఫై చేసుకోవాల్సిఉంది.
- తీసుకురావాల్సిన సర్టిఫికెట్లు ఇవీ: కౌన్సెలింగ్‌కి హాజరయ్యే విద్యార్థులు ప్రాసెసింగ్ ఫీజు పేమెంట్ రశీదు, పాలిసెట్ హాల్‌టికెట్, ర్యాంకు కార్డు, పదవతరగతి/ఈక్వలెంట్ మార్కుల జాబితా, 4నుంచి పదితరగతులవరకు స్టడీ సర్టిఫికెట్స్, కులధ్రువీకరణపత్రం(బీసీ,ఎస్సీ,ఎస్టీ), ఆదాయ ధ్రువీకరణపత్రం, ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్, టీసీలను వెంట తెచ్చుకోవాలి.

ఇండస్ట్రియల్ కారిడార్‌లో రోడ్డు నిర్మాణంపై కసరత్తు



రోడ్డు నిర్మాణంపై కసరత్తు చేస్తున్న అధికారుల బృందం

శ్రీకాళహస్తి, మే 23: విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ అభివృద్ధిలో భాగంగా ఏర్పాటు చేయనున్న రోడ్డు భూసేకరణపై అధికారుల బృందం కసరత్తు చేసింది. తొట్టంబేడు మండలం పొయ్య వద్ద వున్న జాతీయ రహదారి నుంచి బుచ్చినాయుడుకండ్రిగ మండలంలోని పల్లమాల వద్ద తడ రహదారి వరకు ఇండస్ట్రియల్ కారిడార్ రోడ్డును 9.5కి.మీ పొడవు, 45మీటర్ల వెడల్పుతో నాలుగులేన్ల రోడ్డును నిర్మించేందుకు ఇప్పటికే సర్వే పూర్తి చేసిన అధికారులు పలువురికి పరిహారం కూడా అందజేశారు.ఈ నేపథ్యంలో గురువారం ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు, ఆర్అండ్‌బీ, సోషియల్ ఆర్ఆర్‌తదితరశాఖల అధికారుల బృందం పొయ్య, గుమ్మడిగుంట, గౌడమాల గ్రామాలతో పాటు బుచ్చినాయుడు కండ్రిగ మండలంలోని కొత్తపాళెం, పల్లమాల గ్రామాల వద్ద పర్యటించారు. రోడ్డు విస్తరణలో భాగంగా నష్టపోయే ఇండ్లను,పంటలను, ప్రభుత్వ ఆస్తులను పరిశీలించారు.అలాగే ఆస్తులు కోల్పోతున్న కుటుంబాలవారితో మాట్లాడారు. భూసేకరణకు సంబంధించిన సమస్యలపై అధ్యయనం చేశారు. రోడ్డు నిర్మాణం పూర్తయిన వెంటనే ఈ ప్రాంతంలో ఇండస్ట్రియల్ కారిడార్‌లో భాగంగా సెజ్ ఏర్పాటవుతుందని తెలిపారు. అధికారులు దేవరాజు, రాంబాబు, గిరీశ్వర్, ఉదయ్‌శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కౌంటింగ్ నిర్వహణకు ఏర్పాట్లు చేపట్టాం

- వీడియో కాన్ఫరెన్సులో కలెక్టర్ షన్మోహన్



చిత్తూరు కలెక్టరేట్, మే 23: జిల్లాలో ఒక పార్లమెంటు, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన కౌంటింగ్ ప్రక్రియ స్థానిక ఎస్వీసెట్ ఇంజనీరింగ్ కళాశాలలో చేపడుతున్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షన్మోహన్ తెలిపారు. అక్కడ కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశామన్నారు. గురువారం వెలగపూడి నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. చిత్తూరులోని క్యాంపు కార్యాలయం నుంచి ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్, ఆర్వోలు మనోజ్‌రెడ్డి, వెంకటశి, ట్రైనీ కలెక్టర్ హిమవంశీ పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ.. కౌంటింగ్ సెంటర్ల వద్ద మూడెంచల భద్రతను ఏర్పాటుచేశామని, 64 సీసీ కెమెరాలతో కౌంటింగ్ ప్రక్రియను కంట్రోల్ రూము నుంచి నిరంతరం పర్యవేక్షణ చేస్తామని చెప్పారు. ప్రతి అసెంబ్లీ, పార్లమెంటు సెగ్మెంట్లకు విడివిడిగా ఈవీఎంల కౌంటింగ్ కోసం ప్రతి నియోజకవర్గానికి 14 టేబుళ్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సిబ్బందికి ఈ నెల 25న మొదటి ర్యాండమైజేషన్ నిర్వహించి 28న తొలి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు. పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్‌లో భాగంగా ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి మూడుటేబుళ్లు, పార్లమెంటు నియోజకవర్గానికి 18 టేబుళ్లను ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు.

కౌంటింగ్ కేంద్రాల వద్ద అప్రమత్తంగా ఉండండి



కౌంటింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న జేసీ

ఎస్వీసెట్‌లోని స్ట్రాంగ్‌రూములు, కౌంటింగ్ కేంద్రాల వద్ద అనునిత్యం అప్రమత్తంగా విధులు నిర్వహించాలని చిత్తూరు ఆర్వో, జేసీ శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం ఇక్కడి స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ కేంద్రాలు, పోస్టల్ బ్యాలెట్, మీడియా సెంటర్, ఇతర రూములను ఆయన తనిఖీ చేశారు. ఏడు అసెంబ్లీ, చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గాలకు వేర్వేరుగా కౌంటింగ్‌కు సంబంధించి ఏర్పాట్లను పరిశీలించి బ్యారికేడింగ్ వ్యవస్థను పకడ్బందీగా సిద్ధం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు ఆర్డీవో చెన్నయ్య, కమిషనరు అరుణ, మెటీరియల్ మేనేజ్‌మెంట్ అధికారి షణ్ముగం, తహసీల్దార్లు, అధికారులు పాల్గొన్నారు.

పుంగనూరు ఓట్ల లెక్కింపు సజావుగా నిర్వహించాలి

- సీఈవోకు టీడీపీ నేత వినతిపత్రం



ముఖేష్‌కుమార్ మీనాకు వినతిపత్రం అందజేస్తున్న వెంకటరమణ

కల్లూరు, మే 23: పుంగనూరు నియోజకవర్గం ఎన్నికల ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రక్రియ సజావుగా నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్‌కుమార్ మీనాను పులిచెర్ల మండలానికి చెందిన రాష్ట్ర టీడీపీ ఎస్సీ సెల్ విభాగం ప్రధాన కార్యదర్శి ముల్లంగి వెంకటరమణ కోరారు. ఈ మేరకు గురువారం రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారికి వినతిపత్రం అందజేశారు. పుంగనూరు నియోజకవర్గంలో ఇటీవల జరిగిన వైసీపీ దాడులు, దౌర్జన్యాలను దృష్టిలో పెట్టుకొని ఓట్ల లెక్కింపు రోజుల ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేయాలన్నారు. ఓట్ల లెక్కింపు తర్వాత ఎలాంటి అల్లర్లు జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో సీఈవోను కోరినట్లు ఆయన చెప్పారు.

రెండో రోజూ గజ బీభత్సం

సుమారు 5 టన్నుల మామిడి కాయలు నేలరాల్చిన ఏనుగులు

శాశ్వత పరిష్కారంపై దృష్టి సారించని అధికారులు



ఏనుగుల దాడిలో నేలరాలిన మామిడి కాయలను చూపిస్తున్నరైతులు - ధ్వంసమైన బోరు పైపులు

కల్లూరు, మే 23: పులిచెర్ల మండలంలో ఏడాదిగా ఏనుగుల గుంపు తిష్టవేశాయి. అటవీ సమీప పంట పొలాలపై పడి తొక్కేస్తున్నాయి. వ్యవసాయ పరికరాలను విరిచేస్తున్నాయి. దీంతో రైతులకు అపారనష్టం వాటిల్లుతోంది. ఇలా మండలంలోని ఎల్లంకివారిపల్లి పంచాయతీ దిగుమూర్తివారిపల్లి సమీపంలో రెండో రోజైన బుధవారం రాత్రి పంట పొలాలపై ఏనుగులు పడి బీభత్సం సృష్టించాయి. 30 ఏళ్ల మామిడి చెట్లను విరిచేసి టన్నుల కొద్దీ కాయలను నేలరాల్చాయి. రైతులు వీరరాఘవులునాయుడు, ఈశ్వర్‌నాయుడు, పురుషోత్తంనాయుడు, సురేష్‌నాయుడు, విద్యాసాగర్‌నాయుడు, వేణుగోపాల్‌నాయుడు, రామమూర్తినాయుడు, ఆదికేశవులునాయుడు తదితర రైతులు మామిడిచెట్లను విరిచేశాయి. సుమారు 5 టన్నుల మామిడికాయలను నేలరాల్చడంతో రైతులు లబోదిబోమంటున్నారు. బోరుపైపులు, డ్రిప్‌పైపులు, గేట్‌వాల్‌ను ధ్వంసంచేశాయి. దీంతో ఎప్పుడు, ఎక్కడ దాడికి దిగుతాయో తెలియక అటవీ ప్రాంత సరిహద్దుల్లోని ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

కాయ కాయకీ రక్షణ



గంగాధరనెల్లూరు, మే 23: అసలే ఈసారి మామిడి కాయల కాపు చాలా తక్కువ. చెట్లకు కాసిన ప్రతి మామిడి కాయకూ కవర్లతో రక్షణ కల్పిస్తున్నారు రైతులు. గతంలో మామిడితోపుల్లో మామిడి కాయలు దిగుబడి అనుకోని విధంగా రావడంతో.. వాటిని జ్యూస్‌ఫ్యాక్టరీలకు, మామిడి కాయల మండీలకు రైతులు తోలుకొని డబ్బులు తీసుకునేవారు. వాతావరణం పరిస్థితుల దృష్ట్యా ఈసారి గంగాధరనెల్లూరు మండలంలోని మామిడి తోపుల్లో కొన్నిచెట్లకు మాత్రమే దిగుబడి అక్కడక్కడ కనిపిస్తోంది. మరికొందరు రైతులకు ఈసారి పూర్తిగా మామిడిచెట్లల్లో దిగుబడి లేక వెలవెల పోతుంది. మండలంలోని పాతపాళ్యం పంచాయతీ మిట్టకొత్తూరు గ్రామానికి చెందిన రైతులు ఎర్రగుంట్ల కృష్ణమనాయుడు, ఎంప్రాల వెంకటేశులునాయుడుకు మామిడితోపుల్లోని చెట్లకు అక్కడక్కడ మామిడికాయలు దిగుబడి వచ్చాయి. ఒక్కొక్కసారి వర్షాలు రాళ్ళవాన కురిస్తే దాని కారణంగా మామిడికాయలు దెబ్బతిని రైతు నష్టపోయేపరిస్థితి ఉంది. అలాంటి పరిస్థితి రాకుండా.. ఈ రైతులిద్దరూ ముందు జాగ్రత్తగా సుమారు రెండు నెలల క్రితమే ప్రతి మామిడికాయకు కవర్లతో రక్షణ కవచాన్ని ఏర్పాటు చేసుకున్నారు. దీనివల్ల ఆ మామిడికాయలకు పురుగుల బెడద లేకుండా చూసుకోవడంతో పాటు వీటిని భద్రంగా కాపాడు కోగలిగితే పెట్టుబడిలో కొంతవరకైనా రాబట్టుకోవచ్చని ఉద్యాన శాఖ అధికారులు సూచిస్తున్నారు.

నిఘా నీడలో మహిళా వర్సిటీ

- 500 మీటర్ల వరకు నో వెహికల్ జోన్
- అన్ని వైపులా రోడ్లు దిగ్బంధం



మహిళా వర్సిటీ రోడ్డులో మూతబడ్డ షాపులు

తిరుపతి(నేరవిభాగం), మే 23 : వచ్చే నెల 4వ తేది కౌంటింగు జరగనున్న మహిళా వర్సిటీ వద్ద పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేశారు. టీడీపీ చంద్రగిరి అభ్యర్థి పులివర్తి నానీపై హత్యాయత్నం జరిగిన తర్వాత పోలీసు యంత్రాంగం పూర్తిగా అప్రమత్తమైంది.వర్సిటీకి 500 మీటర్ల పరిధిలో చుట్టు పక్కల రోడ్లు నో వెహికల్ జోన్‌గా వుంచారు. అన్ని ప్రాంతాల్లో పోలీసు బలగాలను ఏర్పాటు చేసారు. వర్సిటీ లోపలికి వెళ్ళే రెండు ప్రధాన గేట్ల వద్ద కేంద్ర బలగాలతో పాటు తిరుపతి శాంతి భద్రతల పోలీసులను నియమించారు. వీరు కాకుండా కేంద్ర బలగాలు 24 గంటలూ గస్తీలో వుండేలా పికెట్లు ఏర్పాటు చేశారు. లోపలికి వెళ్ళే ప్రతి ఒక్కరినీ తనిఖీ చేసి వివరాలను ఎంట్రీబుక్‌లో నమోదు చేస్తున్నారు.చుట్టుపక్కల దుకాణాలు మూసివేయించారు.ద్విచక్ర వాహనాలను సైతం అనుమతించడం లేదు. గాయత్రినగర్, కృష్ణానగర్‌లకు వెళ్ళే అన్ని రోడ్లు మూసివేయడంతో మహిళా వర్సిటీ ప్రాంగణం కర్ఫ్యూ వాతావరణాన్ని తలపిస్తోంది.

పోలీసు అధికారులకు నోటీసులు

- కూచువారిపల్లెవాసులపై కేసులో వివరణ కోరిన ఈసీ

చంద్రగిరి, మే 23: చంద్రగిరి మండలం, కూచువారిపల్లెలో జరిగిన దాడులకు సంబంధించి ఐటీ ఉద్యోగులు, వైద్య వృత్తిలో పనిచేస్తున్న టీడీపీ సానుభూతి పరులపై అక్రమ కేసులు బనాయించారని గ్రామస్తులు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. కూచువారిపల్లెకు చెందిన మహేష్ హైదరాబాదులో, ఎస్.దీపిక తిరుపతిలో వైద్యులుగా పనిచేస్తున్నారు. అదేవిధంగా హైదరాబాదులో హరీష్, వంశీ, బెంగళూరులో బాలాజి, మోహన్, చెన్నైలో ముకేష్, నాగేంద్ర, ఆదర్శ్, శ్రావణి ఐటీ కంపెనీల్లో పనిచేస్తున్నారు. పోలింగ్ రోజున ఓటు హక్కు వినియోగించుకోవడానికి గ్రామానికి వచ్చిన తమపై వైసీపీ ఫిర్యాదుతో పోలీసులు కేసులు బనాయించారని ,దానివల్ల తమ భవిష్యత్తు అంధకారమయ్యే ప్రమాదముందని ఈసీకి ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదుతో స్పందించిన ఎన్నికల కమిషన్ ఈ కేసులపై వివరణ ఇవ్వాలని పోలీసుశాఖకు నోటీసులు జారీ చేసింది.

ఆరోగ్యశ్రీ పెండింగ్ బిల్లుల చెల్లింపునకు కృషి చేయండి

- కలెక్టర్‌కు ప్రైవేటు ఆస్పత్రుల విజ్ఞప్తి



కలెక్టర్‌తో మాట్లాడుతున్న ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యాలు

తిరుపతి(కలెక్టరేట్), మే 23: ఎన్నికల కోడ్‌ను పరిగణనలోకి తీసుకుని ప్రైవేటు ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలను కొనసాగించాలని కలెక్టర్ ప్రవీణ్‌కుమార్, ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ యాజమాన్యాలకు విజ్ఞప్తి చేశారు. గురువారం కలెక్టరేట్‌లో ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యాలతో కలెక్టర్ సమీక్షించారు. ప్రైవేటు ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ నిలిపివస్తే రోగులు ఇబ్బందులు పడుతారని, ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని సేవలను కొనసాగించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న ఆరోగ్యశ్రీ బిల్లుల చెల్లింపునకు చర్యలు చేపడుతామని యాజమాన్యాలకు హామీ ఇచ్చారు. ప్రస్తుతానికి ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు ప్రభుత్వం కొంత మొత్తంలో నిధులు విడుదల చేసిందన్నారు. చాలా వరకు ఆరోగ్యశ్రీ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటి చెల్లింపుపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కలెక్టర్‌ను ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యాలు అభ్యర్థించారు. సమావేశంలో జిల్లా సమన్వయ అధికారి రాజశేఖర్‌రెడ్డి, ప్రైవేటు ఆస్పత్రుల ఎండీలు డాక్టర్ వెంకటరమణ, సుధారాణి, రమేష్‌శివకుమార్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మ హుండీ ఆదాయం రూ.34.44 లక్షలు



కుప్పం, మే 23: కుప్పంలోని శ్రీ ప్రసన్న తిరుపతి గంగమాంబ హుండీ ఆదాయం రూ.34,44,290 గా తేలింది. అమ్మవారి జాతర ముగిసిన తర్వాత గురువారంనాడు దేవదాయ, ధర్మదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ ప్రసన్న లక్ష్మి ఆధ్వర్యంలో ఆలయ ఆవరణలోనే హుండీ లెక్కింపు జరిగింది. భక్తులు అమ్మవారికి హుండీ ద్వారా సమర్పించిన బంగారు కానుకలు 82.5 గ్రాములు, వెండి ఆభరణాలు 241.8 గ్రాములు ఉన్నాయి. ఈ హుండీ లెక్కింపులో టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ రెడ్డి, ఈవో చలపతి తదితరులు పాల్గొన్నారు.

అతిసారతో వృద్ధురాలి మృతి

నడింపల్లెలో కొనసాగుతున్న వైద్య శిబిరాలు



మునెమ్మ (ఫైల్ ఫొటో)

శాంతిపురం, మే 23: శాంతిపురం మండలం నడింపల్లె గ్రామంలో అతిసార లక్షణాలతో గురువారం వృద్ధురాలు మునెమ్మ మృతి చెందారు. ఈ గ్రామంలో మంగళవారం వాంతులు, విరేచనాలతో పలువురు అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ప్రమాదం లేదని అధికారులు తెలపడంతో అందరూ తమ ఇళ్లకు చేరుకొన్నారు. గ్రామంలో అందరూ కోలుకోగా మునెమ్మ(70) మాత్రం మృతి చెందినట్లు ఆమె కుటుంబ సభ్యులు, గ్రామస్థులు తెలిపారు. ఈమె మృతి వషయం తెలిసి డీపీవో లక్ష్మి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ పురుషోత్తం, రాళ్లబూదుగూరు పీహెచ్‌సీ వైద్యుడు శివకుమార్, పంచాయతీ అధికారులు గ్రామంలో పర్యటించి వైద్య సేవలను అందించారు. సర్పంచ్ బాలకృష్ణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు చేపడుతున్నారు. గ్రామంలో వాంతులు, విరేచనాలు పూర్తిగా తగ్గుముఖం పట్టాయని అధికారులు తెలిపారు.

జాతరలో చోరీలు రెండే

పలమనేరు, మే 23: పలమనేరులో మూడు రోజులు నిర్వహించిన జాతరలో ఇద్దరు మహిళలు మాత్రం తమ మెడలోని బంగారు గొలుసులు చోరీ జరిగాయని పోలీసులకు ఫిర్యాదు చేశారు. వి.కోట మండలం చింతల గుంట గ్రామానికి చెందిన లక్ష్మమ్మ, పలమనేరుకు చెందిన ఆర్టీసీ ఉద్యోగి సుధాకర్ భార్య వసంత జాతర సందర్భంగా టెంకాయలు కొడుతున్నారు. ఆ సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు వీరి మెడలోని బంగారు చైన్లు లాక్కెళ్లిపోయారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు సీసీ ఫుటేజీలు పరిశీలించే పనిలో పడ్డారు.

విక్టరీ బార్ నుంచే నానీపై దాడికి పథక రచన

తిరుపతి(నేరవిభాగం), మే 23: తిరుపతిలోని మహిళా వర్సిటీ వద్ద చంద్రగిరి టీడీపీ అభ్యర్థి పులివర్తి నానీపై జరిగిన హత్యాయత్నం ఘటనకు సమీపంలోని విక్టరీ బార్ నుంచే పథక రచన చేసినట్లు పోలీసుల దర్యాప్తులో గుర్తించినట్లు సమాచారం.బార్‌లోనే మధ్యాహ్నం ఫుల్‌గా మద్యం సేవించిన నిందితులు అక్కడే దాచి వుంచిన సమ్మెట, రాడ్లు, ఖాళీ బీరు బాటిళ్ళను కారులో వేసుకొచ్చి నానీపై దాడికి ఒడిగట్టినట్లు సమాచారం. దీనిపై అక్కడ వున్న సీసీ ఫుటేజీ, అరెస్టు అయిన ముద్దాయిలిచ్చిన వాంగ్మూలాల మేరకు ఎస్వీయూనివర్సిటీ పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది. ఇప్పటికే బార్‌లో వున్న సీసీ ఫుటేజీని స్వాధీనం చేసుకున్న పోలీసులు ఆ రోజు ఎవరెవరు అక్కడకు వచ్చారు..వారికి ఆతిథ్యం ఇచ్చిన వారెవరనే విషయాలపై దర్యాప్తు చేస్తున్నారు.నానీపై హత్యాయత్నం కేసులో అరెస్టయి కడప జైల్లో వున 13మందిలో తిరుమలకు చెందిన హరి, సుధాకర రెడ్డి, రాములు వున్నారు. తిరుమలలో పెయింటర్‌గా పనిచేస్తున్న శ్రీనివాసులుపై దాడి కేసులో ఈ ముగ్గురూ నిందితులు కావడంతో కేసు నమోదు చేసి అందరికీ 41 కింద నోటీసులు ఇచ్చినట్లు తిరుమల టూ టౌన్ సీఐ సత్యనారాయణ సిట్ అధికారులకు వివరించినట్లు తెలిసింది.నానీపై హత్యాయత్నం కేసులో మరి కొంతమందిని అరెస్టు చేయడానికి పోలీసులు సిద్ధమవుతున్నట్లు సమాచారం.

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్

తిరుపతి - 9160195583, 9703618708 9703618705, 9703618710 9985411629, 9985410347, 9985411003
చిత్తూరు - 9985411584, 9985403122
మదనపల్లి - 9985417476, 9848161191
కుప్పం - 9985403032 పలమనేరు - 9985403032
పుంగనూరు - 9985403204, పీలేరు - 9985403045
పుత్తూరు - 9985411598, శ్రీకాళహస్తి - 9985411596

WANTED

Rtd. Employee /VRS మరియు Qualified సీనియర్ సిటిజన్స్‌కి సువర్ణ అవకాశం. తిరిగి మీ పూర్వ వైభవాన్ని పునర్నిర్మించడం కొరకు సం.ప్ర. KUBER RESIDENCY, TPT. 89784 71248

AJT-3050

WANTED

తిరుపతిలో వివిధ బ్రాంచీలు గల హోటల్ (లాడ్జి) నందు పనిచేయుటకు రూమ్ బాయ్స్ (10), హౌస్ కీపింగ్(6), వాచ్ మెన్లు (3) కావలెను. Cell: 7093956342

AJT-1899

రాజస్థాన్ రైలు యాత్ర

దసరా సందర్భంగా రాజస్థాన్ రైలుయాత్ర తేది.01-10-24. 11రోజులు టికె 21,000/- (భోజనం, ACరూం+ ACబస్సు) కె.వాసు నెల్లూరు. సం.ప్ర. సెల్: 94913 40504

AJR-178309

బంగారం కొనబడును

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(టైబ్రిడ్జ్ పోలీస్ డిపార్ట్‌మెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్ర: 7382114647

AJA-177000

విధ్వంసకర ఘటనలను ఎదుర్కోవడంపై పోలీసుల మాక్ డ్రిల్



మాక్ డ్రిల్‌లో భాగంగా ఇంటి పట్టాలు ఇవ్వాలని ఆందోళన చేస్తున్న ప్రజలు, అదుపుచేస్తున్న పోలీసులు

తిరుపతి(నేరవిభాగం), మే 23: కౌంటింగ్ రోజు అల్లరి మూకలు పాల్పడే విధ్వంసాలు, అల్లర్లు, ఇతరత్రా ఘటనలు జరిగితే ఎలా ఎదుర్కోవాలనే అంశాలపై తిరుపతి పోలీసు పెరేడ్ గ్రౌండులో గురువారం ఎస్పీ హర్షవర్ధనరాజు నేతృత్వంలో పోలీసులు మాక్ డ్రిల్ నిర్వహించారు. కలెక్టర్ కార్యాలయం వద్ద ఇంటి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ప్రజలు పెద్ద ఎత్తున ఆందోళన చేయడం, కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడించడానికి వెళుతున్న ఆందోళనకారులను పోలీసులు ఎలా ఎదుర్కోవాలి... మాబ్ పెద్ద ఎత్తున గుమికూడి చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని సంఘ విద్రోహక శక్తులు పాల్పడే విధ్వంసకర ఘటనలను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి పోలీసులు అన్ని విధాలా సిద్ధంగా ఉన్నారనే విషయాన్ని ప్రజలు, ట్రబుల్ మాంగర్స్‌కు తెలియజేయడానికి మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీలు కులశేఖర్, శ్రీనివాసులు, డీఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు.

హిసర్-తిరుపతి మధ్య ఎక్స్‌ప్రెస్ రాకపోకల పొడిగింపు

తిరుపతి(సెంట్రల్), మే 23: హిసర్-తిరుపతి మధ్య నడుస్తున్న ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్ల (09715-09716) జూన్1 నుంచి 29వ తేదీ వరకు రాకపోకలు పొడిగించినట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు. వేసవి సెలవుల రద్దీ కారణంగా ఈ ప్రత్యేక రైలును పొడిగిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

పాఠకులకు ముఖ్యగమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

వైభవంగా గంగరాళ్ల అభిషేకం


గంగరాళ్లకు పూజలు నిర్వహిస్తున్న మహిళలు

వాల్మీకిపురం, మే 23: వాల్మీకిపురం పట్టణంలోని రైల్వేస్టేషన్ సమీపాన వెలసిన నల్లవీర గంగాభవానీ అమ్మవారి జాతర మహోత్సవాలలో భాగంగా గురువారం గంగరాళ్లకు జలాభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. ఉదయాత్పూర్వం నుం చి ఆలయంలో అమ్మవారికి అభిషేకం, అర్చన, తోమాల సేవలతో ప్రత్యేక పూజలు జరిగాయి. అనంతరం జలకళశాలతో మహిళలు ఊరేగింపుగా వెళ్లి పట్టణంలోని బజారువీధి, నాయక్ వీధులలో గల గంగరాళ్లకు జలాభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమాలలో ఆలయ ధర్మకర్తలు రమణారెడ్డి, రామ్‌కుమార్‌రెడ్డి, కమిటీ సభ్యులు సత్యనారాయణశెట్టి, బలరామ్, అర్చకులు జనాస్వామి, సభ్యులు విజయ్‌కుమార్, మురళి, విజయ్‌కుమార్ వర్మ, భక్తులు పాల్గొన్నారు.

అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పణ

వాల్మీకిపురం పట్టణంలోని నల్లవీరగంగాభవాని అమ్మవారి జాత ర సందర్భంగా పట్టణానికి చెందిన ఉపాధ్యాయులు సురేష్, అరుణకుమారి దంపతులు అమ్మవారికి పట్టువస్త్రాలను సమ ర్పించారు. గురువారం ఆలయ కమిటీ సభ్యుల చేతుల మీదుగా పట్టు వస్త్రాలు అందజేసి ఆలయంలో పూజలు నిర్వహించారు.

గ్రామ దేవతల జాతర ఉత్సవాలు


మల్లాలమ్మ దేవత

పెద్దమండ్యం, మే 23: మండలంలో గ్రామ దేవతల జాతర ఉత్సవాలు వైభవంగా జరిగాయి. మండలంలోని రెక్కలకొండపల్లెలో వెలసిన రెక్కలకొండపల్లె గ్రామ దేవత మల్లాలమ్మ తిరుణాల గురువారం రాత్రి వైభవంగా జరిగింది. అలాగే మండలంలోని సిద్దవరం, కానేకుంట్లపల్లె, చదివేవాండ్లపల్లె గ్రామ దేవతల జాతర్లు జరిగాయి. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో పండుగ సందడి నెలకొంది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బీరంగిలో రేణుకా పరంజ్యోతి జాతర


రేణుకా పరంజ్యోతికి జ్యోతులు తీసుకొచ్చిన భక్తులు

బి.కొత్తకోట, మే23: బి.కొత్తకోట మండల పరిధిలోని బీరంగి గ్రామం లో వెలసిన రేణుకా పరంజ్యోతి అమ్మవారి జాతర మహోత్సవాలు గురువారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ ఉత్సవాలలో మొదటి రోజు బీరంగి గ్రామవాసులు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో జ్యోతులు నిర్వహించి తమ మొక్కులు తీర్చుకున్నారు. జాతర వేడుకలలో భాగంగా అమ్మవారిని సుందరంగా పుష్పాలతో అలంకరించారు. మూడు రోజుల పాటు వివిధ కార్యక్రమాలతో రేణుకా పరంజ్యో తి అమ్మవారి తిరుణాల నిర్వహించనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

మొలకలవారిపల్లెలో మారెమ్మ తిరుణాల

కురబలకోట, మే 23: కురబలకోట మండలం అంగళ్ళు పంచాయ తీ మొలకవారిపల్లె సమీపంలో వెలసిన మారెమ్మ తిరుణాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. రెండు రోజుల పాటు నిర్వహించనున్న తిరుణాల గురువారం నుంచి ప్రారంభం కావ డంతో చుట్టు పక్కల ప్రాంతాలకు చెందిన భక్తులు తరలివచ్చి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. కాగా తిరుణాలకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలు గకుండా ఆలయ కమిటీ చైర్మన్ ఆంజినేయులు, సిబ్బంది ఏర్పాట్లను చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాల తో ప్రత్యేకంగా అలంకరించి ముస్తాబు చేశారు. విద్యుత్ దీపా లతో అలంకరించిన చాందినీ బండ్లను ఊరేగించారు. పలువురు భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించారు.

వైభవంగా బుద్ధపౌర్ణమి ర్యాలీ


బుద్ధపౌర్ణమి సందర్భంగా బహుజనసేన ఆధ్వర్యంలో గొల్లపల్లెలో స్ఫూర్తి ర్యాలీ నిర్వహిస్తున్న శ్రీచందు

మదనపల్లె అర్బన్, మే 23: బుద్ధపౌర్ణమిని పురస్కరించుకుని గురువారం సాయంత్రం స్థానిక గొల్లపల్లెలో బహుజన సేన వ్యవస్థాపన అధ్యక్షుడు శ్రీచందు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ప్రత్యేక వాహనంలో గొల్లపల్లెలో బుద్ధస్ఫూర్తి ర్యాలీ అంబేద్కర్ సర్కిల్, సీటీఎం రోడ్డు బెంగళూరు బస్టాండ్ మీదుగా సాగింది. ఈ సందర్భంగా శ్రీచందు మాట్లాడుతూ బుద్ధయిజం ప్రజలందరికీ స్ఫూర్తిదాయకం కావాలనే ఉద్దేశ్యంతోనే కార్యక్రమం నిర్వహించామన్నారు. కార్యక్రమంలో బహుజనసేన నాయకులు, మున్సిపల్ వైస్ చైర్మన్ జింకా వెంకటాచలపతి, చైతన్య సంస్థ ఫౌండర్ ఎంపీ ఆనందన్, చైతన్య, పోతబోలు రామకృష్ణ, కౌన్సిలర్ ఈశ్వర్‌నాయక్, తదితరలు పాల్గొన్నారు.

జాతర్లకు అనుమతి తప్పనిసరి

తంబళ్లపల్లె, మే 23: ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున తంబళ్లపల్లె మండల వ్యాప్తంగా నిర్వహించే అమ్మవారి జాతర్లకు పోలీసుల నుంచి ముందస్తు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్ఐ శివకుమార్ సూచించారు. గురువారం ఎస్ఐ మీడి యాతో మాట్లాడుతూ...దేశ వ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున శాంతి భద్రతల దృష్ట్యా జాతర్లలో బాణసంచా పేల్చడం, డీజేలు, ఆర్కెస్ట్రా, రికార్డు డాన్సులకు అనుమతి లేద న్నారు. చాందిని బండ్లలో మైకు సెట్ కట్టే నిర్వాహకులు డీఎస్పీ నుంచి అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ పోలీసుల అనుమతితో ప్రశాంత వాతావరణంలో జాతర నిర్వ హించుకోవాలని ఈ సందర్భంగా ఎస్ఐ సూచించారు.

వైభవంగా వైశాఖ పౌర్ణమి వేడుకలు


మదనపల్లె గోవర్ధన్‌గిరిలో అలంకరణలో శ్రీకృష్ణుడు


ములకలచెరువులో ప్రత్యేక అలంకరణలో చెన్నకేశవస్వామి


కలికిరి చాందినీ బండిలో అంకాళమ్మ ఊరేగింపు

మదనపల్లె అర్బన్, మే23: వైశాఖ పౌర్ణమి వేడుకలను మదనపల్లెలో గురువారం వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా పట్టణంలోని అనపగుట్టలోని గోవర్ధన్‌గిరిలో శ్రీకృష్ణుడికి పౌర్ణమి పురస్కరించుకుని విశేషపూజలు, ప్రత్యేక అలంకరణలు చేశారు. ఆలయకమిటీ సభ్యులు, భక్తులు కలిసి పౌర్ణమివేడుకల్లో భాగంగా ఆలయం నుంచి రింగ్‌రోడ్డు మీదుగా అమ్మయచెరువుమిట్ట, అనపగుట్ట చుట్టుకుని గిరిప్రదక్షిణ భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కాగా పట్టణంలో ని బీటీ కళాశాల మైదానంలోని వరాల ఆంజనేయస్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, విశేషపూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. సాయంత్రం స్వామివారికి పల్లకీసేవ అనంతరం ఊరేగింపు ఆలయకమిటీ సభ్యులు నిర్వహించారు. ఈ సందర్భంగా వానరులకు పండ్లను అందజేశారు. సీటీఎం రోడ్డులోని మంజునాథస్వామి ఆలయంలో ప్రౌర్ణమి వేడుకలు ఆల కమిటీ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంజునాథస్వామికి విశేష పూజలు నిర్వహించి అనంతరం ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకోవడానికి భక్తులు క్యూలైన్‌లో వేచిఉన్నారు. అనంతరం ఆలయానికి వచ్చి భక్తులకు అన్నదానం నిర్వహించారు.

ములకలచెరువులో: మండలంలోని వేపూరికోటలో వెలసిన ప్రసన్న చెన్నకేశవస్వామి ఆలయంలో గురువారం వైశాఖ పౌర్ణమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు స్వామివారికి పంచామృత అభిషేకంతోపాటు శాంత హోమం చేపట్టారు. ప్రజల మధ్య ఎలాంటి విద్వేషాలు లేకుండా సుఖ సంతోషాలతో కలిసి మెలిసి జీవించాలని లోక కళ్యాణం కోసం ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పండితుడు సింగరయ్య స్వామి తెలిపారు.

వాల్మీకిపురంలో: వాల్మీకిపురం పట్టణ పడమర పొలిమేరల్లోని ధర్మపథం ఆలయంలో గురువారం పౌర్ణమి వేడుకలను ఎంతో వైభవంగా నిర్వహించారు. షిరిడీసాయి సాలిగ్రామ తిరునారాయణ ధార్మిక సేవా ట్రస్టు ఆధ్వర్యంలో ఉదయం ఆలయంలోని మూలవర్లకు అభిసేకం, అర్చన, తోమాల సేవలతో ప్రత్యేక పూజలు జరిగాయి. సాయంత్రం అభయాంజనేయస్వామికి విశేష భక్తజనం నడుమ ఆకుపూజ, సింధూర పూజ, తోమాల, వడమాల సమర్పణలతో వేడుకగా పౌర్ణమి పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో సత్యనారాయణ స్వామి వ్రత వేడుకలు జరిగాయి. చివరగా భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమాలలో ట్రస్టు వ్యవస్థాపకుడు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

కలికిరిలో: వైశాఖ పౌర్ణమిని పురస్కరించుకుని క్రాస్‌రోడ్డు కలకడ మార్గంలోని అంకాళమ్మ విగ్రహాన్ని వైభవంగా ఊరేగించారు. గురువారం వైశాఖ పౌర్ణమి (మొలకల పౌర్ణమి) రోజున గ్రామాల్లో వైభవంగా వేడుకలు నిర్వహిస్తారు. దీనినే బుద్ధ పౌర్ణమి అని కూడా వ్యవహరిస్తారు. ఇందులో భాగంగా కలికిరిలో అంకాళమ్మను రంగురంగుల విద్యుద్దీపాలంకరణలతో ఏర్పాటు చేసిన చాందినీ బండిలో ఊరేగించారు. క్రాస్‌రోడ్డు, బీడీ కాలనీ, ఇందిరమ్మ కాలనీ తదితర ప్రాంతాల భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వ్యవసాయ కూలీల రక్షణకు ఉద్యమిద్దాం


సమావేశంలో మాట్లాడుతున్న కార్మికసంఘం ప్రధాన కార్యదర్శి బి. వెంకట్

బి.కొత్తకోట, మే23: దేశంలో వ్యవసాయ కార్మికుల హక్కులు, రక్షణ కోసం ఉద్యమాలు చేయాల్సిన అవసరం ఉందని అఖిలభారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ పేర్కొన్నారు. గురువారం బి.కొత్తకోట మండల పరిధిలోని ప్రముఖ పర్యాటక కేంద్రం హార్స్‌లీహిల్స్‌లో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సమావేశాలు ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు దడాల సుబ్బారావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ ప్ర.కార్యదర్శి వెంకట్ మాట్లాడుతూ వ్యవసాయ కూలీలు సాధించుకున్న పథకాలు రక్షించుకోవడం కోసం ఐక్య ఉద్యమాలు నిర్వహించాలన్నారు. సమావేశంలో అఖిలభారత సహాయకార్యదర్శి విక్రమ్‌సింగ్,రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ శ్రీనివాసులు, రవి, కేవి.నారాయణ, ఆంజినేయులు, నాగేశ్వరరావు, కళ్యాణ్, పుల్లయ్య, సింహాచలం, రాజు పాల్గొన్నారు.

చెంబకూరులో పోలీస్ కార్డెన్ సెర్చ్


ప్రజలతో మాట్లాడుతున్న ఎస్ఐ చంద్రశేఖర్

రామసముద్రం, మే 23: మండలంలోని చెంబకూరు ఎస్ఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో మదనపల్లె ఎస్ఐ మోహన్‌నాయక్, నిమ్మనపల్లె ఎస్ఐ, స్థానిక పోలీస్ సిబ్బందితో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈసందర్భంగా సరైన ధ్రువపత్రాలు లేని వాహ నాలకు జరిమానా విధించారు. ఎస్ఐ చంద్రశేఖర్ గ్రామస్థులతో మాట్లాడుతూ గ్రామాల్లో అందరూ శాంతియుతంగా మెలగాలని సూచించారు. రౌడీషీటర్లు, నేర చరిత్ర కలిగిన వారిపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు ఎస్ఐ తెలిపారు. ఎన్నికల్లో గెలిచినవారు ఎలాంటి విజయోత్సవ ర్యాలీలకు అనుమతులు లేవన్నారు. శాంతిభద్రతలకు భరోసా కల్పించేందుకు పోలీస్ కార్డెన్‌సెర్చ్ నిర్వహించినట్లు తెలిపారు.

వైసీపీకి వంతపాడుతున్న సీఎస్‌ను సస్పెండ్ చేయాలి

● టీడీపీ అధికార ప్రతినిధి ఆర్‌జే వెంకటేశ్


మాట్లాడుతున్న ఆర్జే వెంకటేశ్

మదనపల్లె టౌన్, మే 23: రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా కూడా వైసీపీ ప్రభుత్వానికి వంతపాడుతూ పాలన సాగిస్తున్న రాష్ట్ర చీఫ్ సెక్రటరి జవహర్‌రెడ్డిని కేంద్ర ఎన్నికల కమిషన్ సస్పెం డ్ చేయాలని రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి ఆర్‌జే వెంకటేశ్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రతిపక్షాలపై వైసీపీ నాయకు ల దాడిని అరికట్టలేకపోయిన సీఎస్ పూర్తిగా విఫలమయ్యారన్నా రు. పాల్వాయిగేటు పోలింగ్ కేంద్రంలో మాచర్ల ఎమ్మె ల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి స్వయంగా ఈవీఎం లు పగులకొట్టడం దారుణమ న్నారు. జిల్లా మంత్రి పెద్దిరెడ్డి పెద్దఎత్తున తన పీఎల్‌ఆర్ సంస్థకు చెందిన వాహనాలను, ఎక్సవేటర్లను చెన్నై పోర్టు ద్వారా జాంబి యాకు తరలించడం చూస్తే వైసీపీ ఓటమి ఖాయమని నిర్ధారించుకోవచ్చన్నారు. జూన్ 4 తరువాత ప్రజాప్ర భుత్వం వస్తుందని, వైసీపీ అరాచకాలకు అడ్డుకట్టప డుతుందని స్పష్టం చేశారు.

టీడీపీ సీనియర్ నాయకుడు మృతి

ములకలచెరువు, మే 23: మండలంలోని బురకాయ లకోటకు చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు పోలేపల్లి గోపాల్‌రాజు(62) మృతి చెందాడు. గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఇంట్లో కన్నుమూశారు. ఆయన మృతి పట్ల, తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి దాసరిపల్లి జయచంద్రారెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు పాలగిరి సిద్ధా, నేతలు ముత్తుకూరు మౌళా, జేసీబీ సుధాకర్‌నాయుడు, విజయ్‌కుమార్, రామకృష్ణమరాజు, మురళీధర్‌రావు తదితరులు సంతాపం తెలియజేశారు.

అగ్నిప్రమాదంలో వ్యక్తికి గాయాలు

మదనపల్లె టౌన్, మే 23: ఇంట్లోని గ్యాస్‌సిలెండర్ లీక్ కావడం, మంటలు అంటుకోవడంతో లక్ష్మీప్రసాద్(38) అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. మదనపల్లె మండ లం బసినికొండ గ్రామానికి చెంది న లక్ష్మీప్రసాద్ గురువారం ఉదయం కాఫీ పెట్టుకునేందుకు వంట గ్యాస్ స్టౌవ్ అంటించగా ఒక్కసారిగా మంటలు ఎగసిపడ్డాయి. దీంతో అతను తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబీకులు అతడిని మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

కమనీయం.. శ్రీవారి కల్యాణోత్సం

మదనపల్లె అర్బన్, మే 23: స్థానిక దేవళంవీధిలోని ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయంలో గురువారం ఆలయ ఈవో రమణ ఆధ్వర్యంలో శ్రీవారి కల్యాణోత్సవం కమనీయంగా నిర్వహించారు. వార్షిక బ్రహోత్సవాల్లో భాగంగా మూల విరాట్‌కు అర్చనలు, అభిషేకాలు విశేషపూజలు చేశారు. సాయంత్రం స్వామివారికి కోటవారిపల్లె గ్రామస్థులు వస్త్రాలను సమర్పించగా బండమీదకమ్మపల్లె భక్తులు స్వామివారి కల్యాణోత్సవ కన్నుల విందుగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి కల్యాణం తిలకించారు. రాత్రికి కమ్మవీధి. ఆర్ఆర్ వీధి భక్తులు వైభవంగా గరుడోత్సవం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త మార్పురి సుధాకర్‌నాయుడు, మాజీ ఆలయకమిటీ అధ్యక్షుడు బీజే పాండు, సాయిచిత్ర భాస్కర్, మున్సిపల్ కౌన్సిలర్ తులసిరామకృష్ణ, మార్పురి నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

ములకలచెరువు, మే 23: మండలంలోని సోంపల్లెలో వెలసిన కోదండరామస్వామి వారి బ్రహ్మోత్సవాలు గురువారం నుంచి వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయంలో మహాభిషేకం, నూతన వస్త్రాలంకరణ కార్యక్రమాలు జరిగాయి. అలాగే సీతారామ కల్యాణోత్సవాన్ని కన్నులపండవగా నిర్వహించారు. అనంతరం గరుడ వాహనంపై గ్రామోత్సవం చేపట్టారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆలయంలో గదుల వేలంపాట

మదనపల్లె అర్బన్, మే 23: దేవళంవీధిలోని ప్రసన్నవెంకటరమణస్వామి ఆలయంలోని గదులను గురువారం అద్దెకు ఇవ్వడానికి వేలం నిర్వహించినట్లు ఆలయ ఈవో రమణ తెలిపారు. గుర్రంకొండ రెడ్డెమ్మ దేవస్థానం ఈవో మంజుల వేలం నిర్వహణాధికారిణిగా వ్యవహరించారు. మూడేళ్ల కాలం వరకు ప్రతినెల అద్దె రూ.32వేలు చెల్లించే విధంగా మదనపల్లెకు చెందిన బి. నాగేంద్ర వేలంలో పాడుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఆలయ చైర్మన్ బీజే పాండు, కౌన్సిలర్ ఇర్ఫాన్‌ఖాన్, టీడీపీ నాయకుడు రామకృష్ణ, భక్తులు పాల్గొన్నారు.

తాగునీరు, పారిశుధ్య సమస్యలు రానివ్వద్దు

వాల్మీకిపురం, మే 23: మండల వ్యాప్తంగా గ్రామాలలో ఎక్కడా కూడా తాగునీరు, పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని వాల్మీకిపురం ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వైస్ ఎంపీపీ డాక్టర్ వెంకటరమణ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా అధికారులు నివేదికల సమర్పణ అనంతరం ఎంపీడీవో మాట్లాడుతూ మండల వ్యాప్తంగా మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా పనులు కల్పించాలని సూచించారు. అలాగే 15వ ఆర్థిక సంఘం నిధుల ద్వారా గ్రామీణ ప్రాంతాలలో పారిశుద్యం, తాగునీటి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా పంచాయతీ కార్యదర్శులు బాధ్యత తీసుకోవాలన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ ఫిరోజ్‌ఖాన్, ఈవో ఆర్డీ షబ్బీర్‌అహ్మద్, సర్పంచ్ గంగులమ్మ, వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూలో 20 మంది ఎంపిక

మదనపల్లె టౌన్, మే 23: మదనపల్లె జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలో 20 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ ఓబులేసు తెలిపారు. ప్యాకింగ్ రంగంలో అగ్రగామి సంస్థగా పేరొందిన మంజుశ్రీ టెక్నో ప్యాక్ సంస్థ నిర్వహించిన ఇంటర్వ్యూలో ప్రతిభ చూపిన 20 మంది విద్యార్థులను డిప్లొమా ట్రైనీ ఇంజినీర్ ఉద్యోగాలకు ఎంపిక చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ఎం.హరిప్రసాద్, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మహేష్, ఆర్.సావిత్రి పాల్గొన్నారు.

అధ్యాపకులకు ప్రోత్సాహకాలు ప్రదానం


ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహకాలను అందిస్తున్న ప్రిన్సిపాల్ సి.యువరాజ్

కురబలకోట, మే 23: మండలంలోని అంగళ్ళు సమీపంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థులు, అధ్యాపకులకు ప్రోత్సాహక నగదు బహుమతులను ప్రదానం చేసినట్లు ప్రిన్సిపాల్ సి.యువరాజ్ పేర్కొన్నారు. కళాశాలలో విద్యార్థులు, అధ్యాపకులకు ఎన్‌పీటీఈఎల్ ఆన్‌లైన్ పరీక్షలను నిర్వహించగా 395 మంది జాతీయస్థాయిలో టాపర్లుగా నిలిచారు. కాగా అధ్యాపకులకు మినహా ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు రూ.3.94 లక్షల ప్రోత్సాహక నగదు బహుమతులను సర్టిఫికెట్లు ప్రశంసా పత్రాలను అందజేశారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను, అధ్యాపకులను కరస్పాండెంట్ ఎన్.విజయభాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ కీర్తి, ప్రిన్సిపాల్ యువరాజ్, తులసీరామ్‌నాయుడు అభినందించారు.

ఇంగ్లీషు గ్రామర్‌పై శిక్షణ

మదనపల్లె అర్బన్, మే 23: స్థానిక రెడ్డెప్పనాయుడు కాలనీ సమీపంలోని జిల్లాగ్రంథాలయంలో గురువారం వేసవి శిక్షణాశిబిరంలో విద్యార్థులకు ఇంగ్లీషు గ్రామర్‌పై శిక్షణ ఇచ్చారు. ప్రముఖ రచయతలు టీఎస్ ఏ కృష్ణమూర్తి, శకుంతలమ్మ విద్యార్థులకు కథలు వినిపించారు. కాగా మదనపల్లె మహిళా డిగ్రీకళాశాల అధ్యాపకురాలు, ప్రముఖ రచయిత్రి మెహన్‌వల్లి రచించిన మనాలిస్మృ తులు పుస్తకాన్ని వితరణ చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారిణి వసంతకుమారి, గొల్లపుడి తిరుపతిరావు, నాగరాజ, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనకాయలను సరఫరా చేయాలి


మర్రిపాడులో విత్తన నాణ్యతను పరిశీలిస్తున్న డీఏవో చంద్రనాయక్

గుర్రంకొండ, మే 23:రైతులకు సరఫరా చేసే వేరుశనగ విత్తనకాయల్లో నాణ్యత పాటించాలని జిల్లా వ్యవసాయాధికారి చంద్రనాయక్ మిల్లర్లకు సూచించారు. గుర్రంకొండ మండలంలోని మర్రిపాడులో గురువారం ఆయన విత్తనకాయల నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేరుశనగ విత్తనకాయల సరఫరాలో అక్రమాలకు పాల్పడితే మిల్లర్లపై చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో అధికారులు రమేష్‌రాజు, నవీన్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

వేరుశనగ విత్తనాల కోసం రిజిస్ట్రేషన్లు చేసుకోండి

ములకలచెరువు, మే 23: ఖరీఫ్‌లో సాగుకు రైతులు సబ్సిడీ వేరుశనగ విత్తనాలు తీసుకునేందుకు రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని ఏవో లీలాకుమారి తెలిపారు. రైతులు ఆయా గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో పట్టాదారు పాసుపుస్తకాలు, ఆధార్‌కార్డులు తీసుకెళ్లి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. రైతులు ముందుగా డబ్బులు చెల్లించి టోకన్లు తీసుకోవాలని సూచించారు. మండలానికి 4వేల క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు కేటాయించారని, ఈ నెల 29వతేదీ నుంచి విత్తనాల పంపిణీ ప్రారంభిస్తామని చెప్పారు.

నిమ్మనపల్లిలో: ఈ ఏడాది ఖరీఫ్‌లో వేరుశనగ పంటను సాగు చేసే రైతులు సంబంధిత ఆర్బీకేలలో వారి పేర్లను నమోదు చేసుకోవాలని ఏవో మురళిమోహన్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ మండలానికి 1600క్వింటాళ్ల సబ్సిడీ వేరుశనగ విత్తన కాయలు మంజూరు కాగా వాటిలో ఇప్పటికే నారాయణి రకం 500క్వింటాళ్లు వచ్చినట్లు తెలిపారు. అయితే కే-సిక్స్ రకం 1100క్వింటాళ్లు విత్తనకాయలను కూడా సంబంధిత ఆర్బీకేలలో అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. వేరుశనగకాయలు కావలసిన రైతులు పట్టాదారు పాస్‌బుక్, ఆధార్‌కార్డులను ఇచ్చి ఆర్బీకేలలో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ప్రభుత్వం సబ్సిడీతో రైతులకు అందిస్తున్న విత్తనకాయలు కేసిక్స్ రకం బస్తా ధర రూ.1746 కాగా నారాయణి రకం బస్తా ధర రూ.1710గా ఉన్నాయన్నారు. మూడు రోజుల్లో విత్తనకాయలు పంపిణీ చేస్తామన్నారు.

తంబళ్లపల్లెలో: తంబళ్లపల్లె మండల రైతులు ఖరీప్‌లో వేరుశనగ సాగు చేసేందుకు ప్రభుత్వ సబ్సిడీ విత్తన కాయల కోసం పేర్లు రిజిస్టర్ చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి రమణ తెలిపారు. రైతులు ఆయా సచివాలయాల పరిధిలోని ఆర్బీకేలలో సంబంధిత వీఏఏను సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. విత్తన కాయలు కావాల్సిన రైతులు ఆధార్, పాస్‌బుక్, సెల్‌ఫోను నెంబరుతో పేర్లను రిజిస్టర్ చేసుకోవాలని రిజిస్టర్ చేసుకున్న రైతులకు ఈ నెల చివరి నుంచి విత్తన కాయలు పంపిణీ చేస్తామని ఏవో తెలిపారు.

విద్యుత్ లోఓల్టేజీ సమస్య పరిష్కారానికి చర్యలు

● 8 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటులో ఈఈ యుగంధర్


పోతబోలు 8ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఎస్పీడీసీఎల్ అధికారులు

మదనపల్లె టౌన్, మే 24: మదనపల్లె మండలం పోతబోలు సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లోఓల్టేజీ సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టినట్లు ఏపీఎస్పీడీసీఎల్ ఈఈ యుగంధర్ పేర్కొన్నారు. ఏపీఎస్పీ డీసీఎల్ ఆధ్వర్యంలో పోతబోలులో ఏర్పాటు చేసిన 8ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈఈ మాట్లాడుతూ గతంలో ఇక్కడ వున్న 5ఎంవీఏ ట్రాన్స్ ఫార్మర్ స్థానంలో రూ.2కోట్లతో తెప్పించిన 8ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశామన్నారు. దీని వలన పోతబోలు, ఆరోగ్యవరం, కొండామరిపల్లె గ్రామ పంచాయతీ పరిధిలో వ్యవ సాయ విద్యుత్ సరఫరాలో లోవోల్టేజి సమస్య ఉండదన్నారు. అలాగే ఇక్కడ తొలగించిన 5ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను సీటీఎంలో సబ్‌స్టేషన్‌లో ఇప్పటికే ఉన్న 8 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్ తోడుగా అదనంగా కలుపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొటెక్షన్ డీఈ సతీష్, ట్రాన్స్‌ఫార్మర్ ఈఈ మహేశ్వర్‌రెడ్డి, రూరల్ ఏడీఈ సురేంద్రనాయక్, సీటీఎం ఏఈ రమేష్, ప్రొటెక్షన్ ఏఈ అజయ్ తదితరులు పాల్గొన్నారు.

బీసీజీ టీకాల ప్రక్రియను వేగవంతం చేయండి


గుర్రంకొండలో బీసీజీ టీకా కార్యక్రమాన్ని తనిఖీ చేస్తున్న శైలజ

గుర్రంకొండ, మే 23:బీసీజీ టీకాల ప్రక్రియను వేగవంతం వేయాలని జిల్లా అదనపు వైద్య, ఆరోగ్యశాఖాధికారిణి శైలజ సిబ్బందికి సూచించారు. గురువారం ఆమె మండలంలోని తరిగొండ, గుర్రంకొండ ప్రభుత్వ ఆసుపత్రులను తనిఖీ చేశారు. ఇందులో భాగంగా బీసీజీ టీకాను అర్హులైన అందరికి వేయించాలని సిబ్బందిని ఆదేశించారు. ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా ప్రతి గురువారం క్షయ వ్యాధిగ్రస్తులను గుర్తించి టీకాలను వేయాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో కాన్పులు జరిగేలా వైద్య సిబ్బంది పని చేయాలని తెలిపారు. అనంతరం తరిగొండ ఆసుపత్రిని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఆసుపత్రికి సిబ్బంది సకాలంలో హాజరై రోగులకు అందుబాటులో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్లు రవీంద్రనాయక్, సులక్షణ, సిబ్బంది పాల్గొన్నారు.


టీకా కార్యక్రమాన్ని తనిఖీ చేస్తున్న డాక్టర్ జవహర్‌బాబు

కలకడలో: గ్రామీణులు, వయోజనలు బీసీజీ టీకాను సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి డాక్టర్ జవహర్‌బాబు పేర్కొన్నారు. గురువారం ఆయన ఆసుపత్రి పరిధిలోని కురవపల్లె టీకా కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్షయ వ్యాధి అంతమే లక్ష్యంగా భారత్ ప్రభుత్వం టీకాను ప్రవేశ పెట్టిందన్నారు. ప్రజలు అపోహలకు తావులేకుండా అవకాశాన్ని ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది జయరామయ్య, వెంకటేశ్వరరావు, సుబ్బరత్న, వాణి, లక్ష్మీదేవి, ఆశాలు పాల్గొన్నారు.


ములకలచెరువులో టీకా వేస్తున్న వైద్య సిబ్బంది

ములకలచెరువులో:ములకలచెరువులో గురువారం వయోజనులకు బీసీజీ టీకా కార్యక్రమం నిర్వహించారు. 60 ఏళ్లపైబడిన, బీఎంఐ 18 కంటే తక్కువ ఉన్న, మద్యం తాగేవారికి, పొగ తాగుతున్న, క్షయవ్యాధిగ్రస్తులకు సన్నిహితంగా, గత ఐదేళ్లుగా క్షయవ్యాధి గ్రస్తులున్న ఇంట్లో ఇతర కుటుంబ సభ్యులకు వైద్య సిబ్బంది టీకాలు వేశారు. మండలంలో మొత్తం 346 మందికి టీకా వేసినట్లు వైద్యాధికారులు తెలిపారు.

పాలిటెక్నిక్ కళాశాలలో కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభం

మదనపల్లె టౌన్, మే 23: పాలిసెట్ పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు గురువారం నుంచి కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభమైనట్లు ప్రభుత్వ మోడరన్ రెసిడెన్షియల్(జీఎంఆర్) పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఓబులేశు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలిసెట్ ఉత్తీర్ణులైన వారు ఈనెల 24వ తేదీ నుంచి జూన్ 2వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో వారిపేర్లు రిజిస్ట్రేషన్, ఫీజులు చెల్లింపులు జరపాలన్నారు. ఈనెల 27వ తేదీ నుంచి జూన్ 3వ తేదీ వరకు సర్టిఫికెట్ల పరిశీలన, 31వ తేదీ నుంచి జూన్ 5వ తేదీ వరకు ఆప్షన్ల నమోదు, జూన్ 5వ తేదీన ఆప్షన్ల మార్పులు చేసుకోవచ్చన్నారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఫీజు రూ.250, బీసీ, ఓసీ విద్యార్థులకు ఫీజు రూ.700 నెట్‌బ్యాంకింగ్, మీ సేవా కేంద్రాల్లో చెల్లించాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

నేటి నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

మదనపల్లె అర్బన్, మే 23: ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం నుంచి జూన్ 3వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఇంటర్ ఫస్టియర్ పరీక్షలు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 వరకు ఇంటర్ సెకండియర్ పరీక్షలు నిర్వహిస్తునట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు 30 నిమిషాలు ముందుగా హాజరుకావాలని, 5నిమిషాలు ఆలస్యమైనా పరీక్షలకు అనుమతించమన్నారు. మదనపల్లెలో 5 కేంద్రాల్లో ఈ పరీక్షలు నిర్వహి స్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు.

మదనపల్లె నుంచి ఊటీకి ఆర్టీసీ బస్సు

మదనపల్లె అర్బన్, మే 23: వేసవి సెలవుల సందర్భంగా మదనపల్లె నుంచి ఊటీ, మైసూర్‌కు పర్యాటకులకు అనుకూలంగా జూన్ 7వ తేదీన ఆర్టీసీ బస్సు నడుపుతున్నట్లు మదనపల్లె వన్ డిపో మేనేజరు మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. సూపర్‌లగ్జరీ బస్సు 7వ తేదీ రాత్రి 9 గంటలకు మదనపల్లెలో బయలుదేరి 8వ తేదీ ఉదయం ఊటీకి చేరుతుందన్నారు. ఆ రోజు అక్కడ బసచేసి 9 వతేదీ ఉదయం ఊటీ నుంచి బయలుదేరి మైసూర్‌కు చేరుకుని అక్కడ పలు ప్రదేశాలను సందర్శించిన అనంతరం అదే రోజు రాత్రి బయలుదేరి 10వ తేదీ ఉదయం తిరిగి మదనపల్లెకు చేరకుంటుందని డీఎం పేర్కొన్నారు. పోనురాను ఒక్కొక్కరికి రూ.2800 ఛార్జీ నిర్ణయించామన్నారు. విహారయాత్రకు వెళ్లే ప్రయాణికులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు, రిజర్వేషన్ కొరకు ఈ నెంబర్లకు 7382875034, 7382876658 సంప్రదించాలన్నారు.